www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 29 | | 4-7-2026 | | శనివారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు



- యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి
- యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు

4



## ఉగ్రవాదాన్ని ఎగదోయడం మానుకోండి

సింధుజలాలపై పాక్ ప్రేలాపనలపై భారత్ మండిపాటు

4

## స్వాధీనం చేసుకున్న విమానం వేలం

దేశంలోనే తొలిసారిగా ఈడీ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800 విమానాన్ని విక్రయించేందుకు ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ.3 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం.




4

# రాష్ట్రం పరువుపోతుందనే తగ్గాం

## పదేళ్లలో భారీగా అప్పులు

- హరీశ్, కేటీఆర్ పచ్చి అబద్ధాలు
- దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

## కేసీఆర్‌కు డిప్యూటీ సీఎం సవాల్



గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన భారీ అప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేటీఆర్, హరీశ్ రావు లాంటి నేతలు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంపై ఏకంగా 8,21,651 కోట్ల అప్పుల భారం మోపిన మాజీ సీఎం కేసీఆర్‌కు దమ్ముంటే ఈ అంశంపై బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. 10 ఏళ్ల కాలంలో సింగరేణిలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు సంచలన ప్రకటన చేశారు.రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలను బయటపెట్టిన ఆయన.. గత పాలకులు చేసిన 8,21,651 కోట్ల అప్పులు, బకాయిల భారాన్ని తమ ప్రభుత్వం ఎంతో శ్రమతో క్రమబద్ధీకరిస్తోందని వెల్లడించారు.

వివరాలు 2లో..

## నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లొద్దు



- 20 వేల కొలువులు భర్తీ చేయాలి
- అభ్యర్థుల వయోపరిమితి సడలించాలి
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ

...వివరాలు 3లో



## చర్చకు నేను రెడీ!

వివరాలు 2లో..

- బీఆర్ఎస్ అప్పులపై జూపల్లి సవాల్
- సమయానికి ప్రెస్ క్లబ్‌కు మంత్రి
- ముగ్గురు నేతల కోసం కుర్చీలు
- నా లెక్కలు తప్పైతే రాజీనామా.. బీఆర్ఎస్ రద్దు చేస్తారా: జూపల్లి

## కాంగ్రెస్ అబద్ధాలు!

- రాష్ట్ర అప్పులపై తప్పుడు ప్రచారం
- సీఎం, జూపల్లి లెక్కల్లో తేడాలు
- మా ప్రభుత్వానివి 4.17 లక్షల కోట్లు.. మీరు చేసింది 4.5 లక్షల కోట్లు
- ఆధారాలతో వాట్సాప్‌లో హరీశ్ లేఖ

3



## అద్దం లాంటి రోడ్లు!

- రాష్ట్రంలో కొత్త రోడ్ల నిర్మాణం
- జూలైలో 10 ప్యాకేజీల పనులు
- వర్షాకాలం తర్వాత 3 షిఫ్టుల్లో పనులు
- డిసెంబర్ నాటికి ఆసుపత్రుల నిర్మాణం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

వివరాలు 2వ పేజీలో



## ఉస్మానియా రికార్డు!

- 5 అవయవాల మార్పిడి విజయవంతం
- 36 గంటల పాటు శస్త్రచికిత్స
- బృందాన్ని సన్మానించిన మంత్రి దామోదర
- వైద్య రంగంలో సరికొత్త అధ్యాయం
- త్వరలో 6,238 పోస్టుల భర్తీ

వివరాలు 2వ పేజీలో



## గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు

- వెలుగులోకి జైష్-ఎ-మహ్మద్ కుట్రద
- మధ్యప్రదేశ్‌లో 8 మంది అరెస్ట్

3



## నాలుగు రోజుల్లో 6,590.37 కోట్లు

రైతుభరోసా నిధుల విడుదల

3




## కిడ్నాపర్ల ఆటకట్టు!

నెల పసికందు కిడ్నాప్

72 గంటల్లోనే ఛేదించిన పోలీసులు

- సురక్షితంగా చిన్నారిని రక్షించిన వైనం
- కొనుగోలుకు 1.50 లక్షల చెల్లింపు
- 5 గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

3

## వన రక్షణే లక్ష్యం!

- వన మహోత్సవంలో ప్రజల భాగస్వామ్యం
- అటవీ సిబ్బందికి అవార్డుల ప్రకటన
- ప్రభుత్వ నిర్ణయంపై పీసీసీఎఫ్ హర్షం
- మాజీ పీసీసీఎఫ్‌కు ఘన సన్మానం

పీసీసీఎఫ్‌కు మంత్రి సురేఖ దిశానిర్దేశం

3





## అయోధ్య చోరీపై ఆర్ఎస్ఎస్ ఆందోళన

- దోషులను కఠినంగా శిక్షించాల్సిందే
- హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని వదలరాదు
- ఈ ఘటనతో హిందూ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదు
- ఆర్ఎస్ఎస్ ప్రతినిధి దత్తాత్రేయ హోసబలే

3



# ఉస్మానియా రికార్డు!

**5 అవయవాల మార్పిడి విజయవంతం**

**36 గంటల పాటు శస్త్రచికిత్స**

**బృందాన్ని సన్మానించిన మంత్రి దామోదర**

**హైదరాబాద్, జూలై 3::** దేశ వైద్య చరిత్రలోనే ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి సరికొత్త రికార్డు సృష్టించింది. ఏకబిగిన 36 గంటల పాటు శ్రమించి అరుదైన 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ అరుదైన ఘనత సాధించిన డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని వైద్య బృందాన్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఉస్మానియా వైద్యుల ఘనతతో తెలంగాణ వైద్య రంగానికి జాతీయ స్థాయిలో గొప్ప గుర్తింపు లభించిందని ఆయన ప్రశంసించారు. ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రిలో తొలిసారిగా 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు అత్యంత విజయవంతంగా పూర్తి చేశారు. సుమారు 36 గంటల పాటు ఎంతో క్లిష్టంగా సాగిన ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన డాక్టర్ మధుసూదన్ బృందాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యుల ప్రతిభను, వారి అంకితభావాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అవయవదానం అనేది మహాదానం అని, ఈ సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వైద్య రంగంలో సరికొత్త అధ్యాయం లిఖించబడిందని మంత్రి కొనియాడారు. దేశ వైద్య చరిత్రలోనే అత్యంత అరుదైన ఘనతను ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి సొంతం చేసుకుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం గట్టి సంకల్పంతో పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే వైద్య రంగ బలోపేతానికి పెద్దపీట వేస్తూ గత 2.5 ఏళ్ల కాలంలోనే 15 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. అంతేకాకుండా తాజాగా మరో 6,238 పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలను నిరంతరం విస్తరిస్తున్నామని మంత్రి దామోదర స్పష్టం చేశారు.

# వన రక్షణే లక్ష్యం!

**పీసీసీఎఫ్‌కు మంత్రి సురేఖ దిశానిర్దేశం**

**హైదరాబాద, జూలై 3:** రాష్ట్రంలో అటవీ సంపద రక్షణ, పచ్చదనం పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర నూతన పీసీసీఎఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్.. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అటవీ రక్షణలో అత్యాధునిక సాంకేతికతను వినియోగించాలని, వన మహోత్సవంలో ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని మంత్రి ఆయనకు దిశానిర్దేశం చేశారు. అటవీ శాఖ సిబ్బందికి ఏటా అవార్డులు ప్రకటించినందుకు మంత్రికి పీసీసీఎఫ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ పొందిన మాజీ పీసీసీఎఫ్ స్వర్ణను మంత్రి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర అటవీ దళాల నూతన ప్రధాన సంరక్షణాధికారి (పీసీసీఎఫ్) గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్ శుక్రవారం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో



అటవీ సంపద రక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, సామాజిక అటవీ కార్యక్రమాలపై వారు సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించాలని మంత్రి సూచించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆమె దిశానిర్దేశం చేశారు. అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆమె స్పష్టం చేశారు. అటవీ కార్యక్రమాల అమలులో సాంకేతికత వినియోగం, రక్షణ చర్యల బలోపేతంపై కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని వినయ్ కుమార్‌కు సూచించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అటవీ శాఖ పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందని పీసీసీఎఫ్ వినయ్ కుమార్ మంత్రికి హామీ ఇచ్చారు. అడవుల సంరక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ అటవీ సంపదను కాపాడుతున్న సిబ్బందికి ప్రతి ఏటా అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు చేపట్టినందుకు పీసీసీఎఫ్ వినయ్ కుమార్ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అటవీ రంగంలో ఈ చర్య మైలురాయిగా నిలుస్తుందని, సిబ్బంది సేవలకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి ఇది నిదర్శనమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాగా, పదవీ విరమణ తర్వాత తనను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ పీసీసీఎఫ్ స్వర్ణను మంత్రి కొండా సురేఖ చీరతో సత్కరించి అభినందించారు. అటవీ శాఖకు ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనంతర జీవితం సంతోషంగా గడపాలని మంత్రి ఆకాంక్షించారు.

# రాష్ట్రం పరువుపోతుందనే తగ్గాం

- పదేళ్లలో భారీగా అప్పులు
- హరీశ్, కేటీఆర్ పచ్చి అబద్ధాలు
- దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి
- కేసీఆర్‌కు డిప్యూటీ సీఎం సవాల్

**హైదరాబాద్, జూలై 3:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన భారీ అప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేటీఆర్, హరీశ్ రావు లాంటి నేతలు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంపై ఏకంగా 8,21,651 కోట్ల అప్పుల భారం మోపిన మాజీ సీఎం కేసీఆర్‌కు దమ్ముంటే ఈ అంశంపై బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. 10 ఏళ్ల కాలంలో సింగరేణిలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు సంచలన ప్రకటన చేశారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలను బయటపెట్టిన ఆయన.. గత పాలకులు చేసిన 8,21,651 కోట్ల అప్పులు, బకాయిల భారాన్ని తమ ప్రభుత్వం ఎంతో శ్రమతో క్రమబద్ధీకరిస్తోందని వెల్లడించారు. 10 ఏళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం



చేశారు. సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి అబద్ధాలు తీసుకెళ్తున్నారని బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. అప్పుల అంశంపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందనే ఉద్దేశంతోనే తాము తగ్గామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక 2.08 లక్షల కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నేతలు 10 శాతం వడ్డీతో తెచ్చిన అప్పులను తాము తగ్గించి.. కట్టాల్సిన వడ్డీ భారాన్ని 34 వేల కోట్ల నుంచి 11 వేల కోట్లకు దించామని వివరించారు. అప్పులను తక్కువ చేసి చూపేందుకు కేటీఆర్, హరీశ్ రావు విఫలయత్నం చేస్తున్నారని, మంత్రిగా పనిచేసిన విషయాన్ని మరచిపోయి హరీశ్ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులపై కేసీఆర్ స్పందించాలని, దమ్ముంటే నేరుగా బహిరంగ చర్చకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. బొగ్గు గనుల కేటాయింపులు, ఉత్పత్తికి సంబంధించి గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి సంస్థను నష్టాల్లోకి నెట్టిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిని కాపాడుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని వివరించారు. గత ప్రభుత్వ కాలంలో సింగరేణిలో జరిగిన అక్రమ వ్యవహారాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు భట్టి ప్రకటించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, కనీస సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ ప్రభుత్వం వచ్చాకే విద్యా సంస్థల్లో వసతులు మెరుగుపరిచి సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఆయన స్పష్టం చేశారు.

# చర్చకు నేను రెడీ!

- బీఆర్ఎస్ అప్పులపై జూపల్లి సవాల్
- సమయానికి ప్రెస్ క్లబ్‌కు మంత్రి
- ముగ్గురు నేతల కోసం కుర్చీలు
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రాలేదు
- నా లెక్కలు తప్పైతే రాజీనామా
- బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా: జూపల్లి



**హైదరాబాద్, జూలై 3:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై బహిరంగ చర్చకు రావాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్ రాజకీయంగా కాక రేపుతోంది. తాను చెప్పిన సమయానికి సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌కు వచ్చిన మంత్రి.. బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు కోసం కుర్చీలు వేసి ఎదురుచూశారు. కానీ వారు చర్చకు రాకుండా పారిపోయారని, తన లెక్కలు తప్పైతే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని ఆయన తేల్చిచెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులపై చర్చకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌కు రావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఉదయం సవాల్ విసిరారు. తాను చెప్పినట్లుగానే సాయంత్రం 5 గంటలకు ఆయన ప్రెస్ క్లబ్‌కు చేరుకున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు కోసం అక్కడ 3 కుర్చీలు వేసి ఎదురుచూశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను వెనకడుగు వేసి పారిపోయే వ్యక్తిని కానన్నారు. తన లెక్కలు తప్పైతే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ లెక్కలు తప్పైతే వాళ్ల రాజీనామా చేస్తారా, పార్టీని రద్దు చేస్తారా అని ఆయన నిలదీశారు.

**హరీశ్ రావు బుకాయింపు..**

ముగ్గురు నేతలకు 4 పేజీల చొప్పున ఆధారాలతో వాట్సాప్‌లో లేఖలు పంపానని జూపల్లి తెలిపారు. రాష్ట్ర అప్పు 4,17,496 కోట్లు అంటూ హరీశ్ రావు రిటర్న్ లేఖ పంపారని, అందులో అంతా సొల్లు పురాణం ఉందని మండిపడ్డారు. కేటీఆర్ అసెంబ్లీలో ఒకసారి 3,17,015 కోట్లు అని, మరోసారి 3,85,045 కోట్లు అని చెప్పారన్నారు. హరీశ్ రావు ఒకసారి 4,26,499 కోట్లు అని, మరోసారి 4,17,496 కోట్లు అని చెప్పారని గుర్తుచేశారు. కానీ కేసీఆర్ దిగిపోయే సరికి రాష్ట్ర అప్పు 8,21,651 కోట్లు ఉందని మంత్రి కుండబద్దలు కొట్టారు. కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పులను ఎందుకు చెప్పడం లేదని ఆయన ప్రశ్నించారు.

**పారిపోయే లక్షణం లేదు..**

ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా హరీశ్ రావు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రాకపోతే తాను చెప్పే లెక్కలు తప్పని మీడియాతో చెప్పించాలన్నారు. పారిపోయే లక్షణం తమ ఇంటావంటా లేదని, ఆత్మగౌరవం కోసం నాడు పదవికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకునే వాడినని, రాజకీయాల నుంచి వ్యాపారంలోకి రాలేదని స్పష్టం చేశారు. కాగా, చర్చకు రావాలని పిలిచి పోలీసులతో అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# అద్దం లాంటి రోడ్లు!

- రాష్ట్రంలో కొత్త రోడ్ల నిర్మాణం
- జూలైలో 10 ప్యాకేజీల పనులు
- వర్షాకాలం తర్వాత 3 షిఫ్టుల్లో పనులు
- డిసెంబర్ నాటికి ఆసుపత్రుల నిర్మాణం
- అధికారుల నిర్లక్ష్యంపై కఠిన చర్యలు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 3:** రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, రానున్న రెండేళ్లలో ఏ మూలన చూసినా నాణ్యమైన రోడ్లు అందుబాటులోకి వస్తాయని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. రోడ్లు, హైకోర్టు, ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, వర్షాకాలం ముగిశాక 3 షిఫ్టుల్లో పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో కనీస నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో న భూతో న భవిష్యతి రీతిలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి సంకల్పించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా జూన్ 28 న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా సీఎం చేతుల మీదుగా రాష్ట్ర హైవే రోడ్ల పనులకు పైలాన్ ఆవిష్కరణ చేశామన్నారు. మంచి రోడ్డు ప్రగతికి సూచిక అని, దీనివల్ల పల్లె, పట్టణాలకు కనెక్టివిటీ పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖలో జరుగుతున్న పనులపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. విభాగాల వారీగా పనుల పురోగతిపై సమీక్షించిన మంత్రి.. పనులు ఏ దశలో ఉన్నాయో ఆరా తీశారు. తొలి విడతలో సుమారు 13 వేల కోట్లతో 6092 కిలోమీటర్ల రోడ్ల పనులు



34 ప్యాకేజీల్లో చేపట్టనుండగా.. ఈ జూలై నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజీ 2 లో సుమారు 155 కోట్ల అంచనాతో 42 కిలోమీటర్ల పొడవుగల నల్గొండ, మహబూబ్ నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో వాటి వేగం పెంచాలన్నారు. వర్షాకాలం పూర్తయిన తర్వాత 3 షిఫ్టుల్లో పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. అనుభవజ్ఞులైన ఇంజినీర్లను ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ నెల 6 న కరీంనగర్ జిల్లాలో చేపట్టే హైవే రోడ్ల పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. రాజేంద్రనగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవనం, న్యాయమూర్తుల నివాస సముదాయాల నిర్మాణాలపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, పనులు వేగంగా జరగాలని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 16 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. 3 షిఫ్టుల్లో పనులు జరిగేలా కార్మికుల సంఖ్య పెంచి 2027 డిసెంబర్ నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి తేల్చిచెప్పారు. ఉస్మానియా ఆసుపత్రి పనుల్లో వేగం పెరగాలని, దీన్ని కూడా 2027 డిసెంబర్ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. సనత్ నగర్ టిమ్స్ ప్రారంభానికి సిద్ధమైందని, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల పనులను కూడా వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తానని, పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాసర, భద్రాచలం ఆలయ నిర్మాణ పనులు, గోదావరి పుష్కరాల కోసం ఆర్ అండ్ బీ ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు.

# క్రిస్టియన్లకు గుడ్‌న్యూస్!

**క్రిస్టియన్ మైనార్టీల కోసం పోర్టల్**

**లాంచ్ చేసిన మంత్రి అజారుద్దీన్**

**స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు**

**జూలై 18 వరకు ఆన్‌లైన్‌లో ఛాన్స్**

**పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ**

**హైదరాబాద్, జూలై 3:** క్రిస్టియన్ మైనార్టీల స్వయం ఉపాధి, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సంక్షేమ పథకాల దరఖాస్తుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఓబీఎంఎంఎస్ పోర్టల్‌ను మంత్రి మహ్మద్ అజారుద్దీన్ ప్రారంభించారు. మహిళలు, యువత ఆర్థికంగా ఎదిగేందుకు ఉద్దేశించిన ఈ పథకాలకు జులై 18 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రారంభించింది. ఈ మేరకు మంత్రి మహ్మద్ అజారుద్దీన్ ఓబీఎంఎంఎస్ పోర్టల్‌ను ప్రారంభించారు. అర్హులైన క్రిస్టియన్ మైనార్టీ అభ్యర్థులు ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కుట్టు మిషన్, పెట్టీ బిజినెస్, బైక్, ఈ–బైక్ వంటి స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జులై 3 నుంచి జులై 18 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తామని వెల్లడించారు. మహిళలు, యువత స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందించినట్లు మంత్రి తెలిపారు.



# కాంగ్రెస్ అబద్ధాలు!

- అప్పులపై కాంగ్రెస్ పచ్చి అబద్ధాలు
- రాష్ట్ర అప్పులపై తప్పుడు ప్రచారం
- పూటకో మాట చెబుతున్న మంత్రులు
- సీఎం, జూపల్లి లెక్కల్లో తేడాలు
- ఆధారాలతో వాట్సాప్‌లో హరీశ్ లేఖ



**హైదరాబాద్,జూలై 3:** రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు ఆడుతోందని, ముఖ్యమంత్రి చెప్పే లెక్కలకు.. మంత్రులు చెప్పే లెక్కలకు పొంతనే లేకుండా పోయిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పూటకో మాట, రోజుకో అడ్రస్ అన్నట్లుగా మంత్రి జూపల్లి కృష్ణారావు తీరు తయారైందని ఎద్దేవా చేశారు. జూపల్లి సవాళ్ల నేపథ్యంలో అసెంబ్లీ వీడియోలు, ఆర్బీఐ అధికారిక గణాంకాలను వాట్సాప్ ద్వారా పంపిన హరీశ్ రావు.. ఇప్పుడు తప్పుడు లెక్కలు చెప్పినందుకు ఎవరు రాజీనామా చేయాలో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో హరీశ్ రావు పాల్గొని కాంగ్రెస్ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర అప్పులపై ఆ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తనకు రాసిన లేఖలో.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 1,77,058 కోట్లు అప్పు చేసిందని పేర్కొన్నారని తెలిపారు. కానీ 4 నెలల క్రితం మార్చి 18 న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం చేసిన అప్పు 3,47,294 కోట్లు అని స్వయంగా ప్రకటించారని గుర్తుచేశారు. ఆ 4 నెలల అప్పులు కూడా కలిపితే ఇది ఏకంగా 4 లక్షల కోట్లు దాటుతుందని, జూపల్లి ఒక మాట, సీఎం ఇంకో మాట చెబుతున్నారని, ఇప్పుడు ఎవరు రాజీనామా చేయాలో తేల్చాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం చేసిన అప్పులపై బహిరంగ లేఖ రాసిన హరీశ్ రావు.. పలు ఆధారాలను జూపల్లి వాట్సాప్‌కు పంపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గణాంకాల ప్రకారం 2026 జూన్ 30 నాటికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు 1,86,067 కోట్లుగా ఉందని హరీశ్ రావు అందులో పేర్కొన్నారు. ఆర్బీఐ తెచ్చిన అప్పుల్లోనే తేడాలు చెప్పారని, ఏం చేయాలో అర్థంకాక డ్యామేజ్ కంట్రోల్ చేసుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 9.5 ఏళ్లలో తీసుకున్న అప్పులు 4.17 లక్షల కోట్లు అని అసెంబ్లీలోనే చెప్పామని, ఈ లెక్కలపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా కేవలం కొన్ని నెలల్లోనే సుమారు 4.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆయన ఆరోపించారు. మంత్రి జూపల్లి రోజుకో అడ్రస్ చెబుతూ గందరగోళం సృష్టిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. మొదట తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పి, ఆ తర్వాత మాట మార్చి గన్ పార్క్‌కు వెళ్లారని ఎద్దేవా చేశారు. తాము గన్ పార్క్‌కు వెళ్లకుండా పోలీసులతో అడ్డుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ తమ లెక్కలను ఎప్పుడూ మార్చలేదని, కాంగ్రెస్ నేతలే సందర్భానుసారంగా అప్పుల అంకెలను మారుస్తున్నారని విమర్శించారు. పంపిన ఆధారాలను పరిశీలించి వాస్తవాలు తెలుసుకోవాలని, ఇకనైనా అప్పుల అంశంపై తప్పుడు ప్రచారం మానుకోవాలని హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

# 20 వేల కొలువులు భర్తీ చేయాలి

- నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లొద్దు
- అభ్యర్థులకు వయోపరిమితి వెంటనే సడలించాలి
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ
- బాల కార్టూనిస్టుకు ప్రత్యేక అభినందనలు



**హైదరాబాద్,జూలై 3:** తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వెంటనే 20 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. మరోవైపు అద్భుతమైన కార్టూన్లతో పుస్తకం ప్రచురించిన 11 ఏళ్ల బాల మేధావిని కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై పరీక్షలకు పోటీపడే యువతలో ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే ఉంటారని కేటీఆర్ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను వదిలి హైదరాబాద్‌కు వచ్చి ఏళ్ల తరబడి రేయింబవళ్లు కష్టపడుతున్న యువత ఆశలపై నీళ్లు చల్లొద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీఐ ద్వారా రాష్ట్రంలో సుమారు 17 వేల పోలీసు పోస్టులు ఖాళీ ఉన్నాయని తేలిందని, సీఎం స్వయంగా 12 వేల పోస్టులను భర్తీ చేస్తామని పలుమార్లు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ కేవలం 5 వేల ఉద్యోగాలకే ప్రకటన ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదని, దీనివల్ల సుమారు 15 లక్షల మంది ఆశావహులకు తీవ్ర నిరాశ ఎదురైందని విమర్శించారు. దిల్‌సుఖ్‌నగర్ లాంటి ప్రాంతాల్లో ప్రతిరోజు నిరుద్యోగులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 47 వేల పోలీసు ఉద్యోగాలు భర్తీ చేశామని కేటీఆర్ ఈ లేఖలో గుర్తుచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ పేరుతో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిందన్నారు. నిరుద్యోగుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని కనీసం 20 వేల పోలీసు ఉద్యోగాలతో నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే జీవో 87 ప్రకారం ఎస్సై అభ్యర్థులకు 35 ఏళ్లు, కానిస్టేబుల్ అభ్యర్థులకు 32 ఏళ్ల గరిష్ట వయోపరిమితి ఉందని, పోలీసు నోటిఫికేషన్లు వెలువడి దాదాపు 4 ఏళ్లు గడుస్తున్నందున కచ్చితంగా వయోపరిమితిని సడలించాలని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు 11 ఏళ్ల బాల కార్టూనిస్టు శ్రీయాన్ శ్రీరంగంను కేటీఆర్ ప్రత్యేకంగా కలసి అభినందించారు. 7 ఏళ్ల వయసులోనే కార్టూన్లు గీయడం ప్రారంభించిన శ్రీయాన్ తన ఉత్తమ కార్టూన్లతో 'బ్రోచేవారెవరు బ్రో నను' పేరుతో పుస్తకాన్ని ప్రచురించడం విశేషమని కొనియాడారు. అతడి ప్రతిభను మెచ్చుకున్న కేటీఆర్ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరాలని, మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## నాలుగు రోజుల్లో రూ.6,590.37 కోట్లు

### వెంటవెంటనే రైతుభరోసా నిధుల విడుదల

**హైదరాబాద్,జూలై3 :** రైతు భరోసా పథకం అమలులో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. కేవలం నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.6,590.37 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేసి రికార్డు సృష్టించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నేడు నాలుగో విడతలో 4 నుంచి 5 ఎకరాల భూమి ఉన్న రైతులకు రూ.1,188 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఈ విడతలో 4.41 లక్షల మంది రైతులు లబ్ది పొందినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటివరకు మొత్తం 65.76 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా సాయం జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన అర్హులైన రైతులకు కూడా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు భరోసా నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి తెలిపారు.

## 6న తెలంగాణ ఉద్యమకారులతో భేటీ

**హైదరాబాద్, జూలై 3:** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమం కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు ఏర్పాటు చేసిన కమిటీ ఈ నెల 6 నుంచి ఉద్యమకారులతో విస్తృత స్థాయి సంప్రదింపులు ప్రారంభించనుంది. తొలి సమావేశంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి జేఏసీ నాయకులతో కమిటీ సమావేశం కానుంది. సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారకం వద్ద ఈ నెల 6న ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు.

## అయోధ్య చోరీపై ఆర్ఎస్ఎస్ ఆందోళన

- దోషులను కఠినంగా శిక్షించాల్సిందే
- హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని వదలరాదు
- ఈ ఘటనతో హిందూ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదు
- విచారం వ్యక్తం చేసిన ఆర్ఎస్ఎస్ ప్రతినిధి దత్తాత్రేయ హోసబలే



**న్యూఢిల్లీ, జూలై 3:** అయోధ్య రామ మందిర విరాళాల చోరీ ఘటనపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎసెస్ ఆందోళన వ్యక్తం చేసింది. రాముడి విరాళాలను దొంగిలించడం తమను తీవ్రంగా బాధిస్తోందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే విచారం వ్యక్తం చేశారు. తరతరాలుగా భక్తుల త్యాగాలు, అంకితభావం కారణంగా శ్రీరామ జన్మభూమిలోని ఈ భారీ ఆలయం రూపుదిద్దు కుందన్నారు. ఆలయ నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఒక ప్రత్యేకమైన అంశంగా పరిగణించి, ఆలయ నిర్వహణలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాలని హోసబలే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను కోరారు. ఈ కేసులో దర్యాప్తు జరుగుతున్నందున నిందితులకు శిక్షపడే వరకు సంయమనం పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను అవకాశంగా తీసుకొని కొందరు వ్యక్తులు హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో రాజీనామా చేసిన అయోధ్య ఆలయ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాలకు శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ షో-కాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయ అధికారుల మధ్య జులై 6న జరగనున్న కీలక సమావేశంలో ఈ చర్యలు తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విరాళాల అవకతవకలకు సంబంధించి లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని వారిని కోరనున్నట్లు తెలిపాయి. దర్యాప్తు అనంతరం వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రామ్ మందిర్ విరాళాల వివాదంపై ఆర్ఎస్ఎస్ శుక్రవారం స్పందించింది. అయోధ్య హుండీల నుంచి డబ్బులు దొంగతనం చేయటంపై ఆర్ఎస్ఎస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సంఘటన ఎంతో బాధ కలిగించిందని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జనరల్ సెక్రటరీ దత్తాత్రేయ హాళసబలే న్యూఢిల్లీ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో.. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఆలయ నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కోరారు. దేశ వ్యతిరేక శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఘటన కోట్లాది మంది రామభక్తుల నమ్మకాన్ని, హిందూ సమాజం సెంటిమెంట్లను తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన కారణంగా మేము తీవ్ర ఆవేదనకు, ఆగ్రహానికి గురయ్యాం. ఈ దురదృష్టకర సంఘటనను హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక శక్తులు తమ స్వార్థం కోసం వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. హిందూ సమాజంపై, సనాతన ధర్మంపై బురద జల్లడానికి ఈ వివాదాన్ని ఒక అస్త్రంగా మలచుకునే కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఈ కష్టసమయంలో హిందూ సమాజమంతా ఎంతో ఓపికను, నిగ్రహాన్ని ప్రదర్శించాలి. ఎలాంటి తప్పుడు ప్రచారాలకు లోనుకాకుండా.. శత్రువుల కుట్రలను తిప్పికొట్టడానికి అందరూ ఐక్యమత్యంగా ఉండాలి. రామమందిరం ఎన్నో తరాల పోరాటాలు, కోట్లాది మంది త్యాగాల ఫలితంగా నిర్మితమైంది. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా ఆలయ ట్రస్ట్ పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం నాకు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.




# కిడ్నాపర్ల ఆటకట్టు!

### నెల పసికందు కిడ్నాప్.. 72 గంటల్లోనే ఛేదించిన పోలీసులు

సురక్షితంగా చిన్నారిని రక్షించిన వైనం

కొనుగోలుకు 1.50 లక్షల చెల్లింపు..

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్,జూలై 3:** సంతానం లేదనే బాధతో ఓ మహిళ అడ్డదారి తొక్కింది. డబ్బు ఆశ చూపి నెల రోజుల పసికందును కిడ్నాప్ చేయించింది. కానీ సైబరాబాద్ పోలీసుల వేగంతో ఆమె ఆటలు సాగలేదు. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో కిడ్నాప్‌నకు గురైన చిన్నారిని కేవలం 72 గంటల్లోనే పోలీసులు సురక్షితంగా రక్షించారు. ఈ వ్యవహారంలో 5 గురు నిందితులను అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు. చందానగర్ పరిధిలో జరిగిన పసికందు కిడ్నాప్ కేసును సైబరాబాద్ పోలీసులు 72 గంటల్లోనే ఛేదించారు. ఈ మేరకు శుక్రవారం సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ రమేష్ రెడ్డి వివరాలు వెల్లడించారు. గత నెల 30 వ తేదీ అర్ధరాత్రి దాటాక 2 గంటల ప్రాంతంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో కర్ణాటకకు చెందిన ఓ కుటుంబం రోడ్డుపై నిద్రిస్తోంది. వారి వద్ద నుంచి 1 నెల వయసు గల ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. 'ఆపరేషన్ ముస్కాన్'లో భాగంగా తప్పిపోయిన, కిడ్నాప్‌నకు గురైన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించే క్రమంలో ఈ కేసును పోలీసులు అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సాధిక మక్సూద్ అనే మహిళకు పిల్లలు లేకపోవడంతో చిన్నారిని అక్రమంగా తెప్పించుకునేందుకు కుట్ర పన్నినట్లు విచారణలో గుర్తించారు. బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తున్న నిమ్మి జహాన్, రహనుమా అలీ సహాయం కోరింది. దీంతో వీరు లింగంపల్లి వద్ద నిద్రిస్తున్న కుటుంబం నుంచి పసికందును ఆటోలో ఎత్తుకెళ్లారు. ఆ శిశువును తీసుకురావడానికి కిడ్నాపర్లకు సాధిక 1.50 లక్షలు చెల్లించినట్లు విచారణలో తేలింది. పాపను తీసుకుని కోల్‌కతా వెళ్లేందుకు వారు రైల్వే టికెట్లు కూడా బుక్ చేసుకున్నారు. అయితే పోలీసులు వేగంగా స్పందించి వారిని అదుపులోకి తీసుకుని పాపను రక్షించామని సీపీ తెలిపారు. ఈ కేసులో మహమ్మద్ జుబేర్, మహమ్మద్ ఇర్ఫాన్, సాధిక మక్సూద్, నిమ్మి జహాన్, రహనుమా అలీలను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో డీసీపీ క్రైమ్స్ శ్రీనివాస్, ఆర్సీ పురం ఏసీపీ వై శ్రీనివాసరావు, చందానగర్ సీఐ విజయ్ కుమార్, అమీన్‌పూర్ డీఐ భాస్కర్‌తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు

### వెలుగులోకి జైష్-ఎ-మహ్మద్ కుట్ర.. మధ్యప్రదేశ్‌లో 8 మంది అరెస్ట్

**గాంధీనగర్, జూలై 3:** గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు కోసం ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మహ్మద్ చేసిన కుట్ర వెలుగులోకి వచ్చింది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్.. గుజరాత్, మధ్యప్రదేశ్‌లో 8 మందిని అరెస్ట్ చేసింది. గుజరాత్ ఏటీఎస్ అధికారులు గురువారం గుజరాత్‌లోని బనస్కాంత, పటాన్, నవ్‌సారితో పాటు పొరుగు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని దేవాస్ ప్రాంతంలో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఈ 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అహ్మద్ గాజీవాలా, ఇబ్రహీం ఘూఘా, ముదస్సిర్ గాజీవాలా, జకారియా దురానీ, ముఫ్తీ ఫౌజాన్ దౌవా, మహ్మద్ అమీన్ పాలన్‌పురి, మహ్మద్ అబ్దుల్ సాఫ్దీ, బిలాల్ దురానీ ఘూఘాగా గుర్తించారు. వీరిలో ముగ్గురు సిద్ధ్‌పూర్, చిఖ్లీలోని మతపరమైన విద్యాసంస్థలతో సంబంధం ఉన్నట్లు తేలింది. నిందితులంతా జైష్-ఎ-మహ్మద్ సంస్థ తరపున యాక్టివ్‌గా పనిచేస్తూ.. గుజరాత్ వ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి పని చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. అంతేకాదు.. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతుగా రిక్రూట్‌మెంట్లు చేపట్టడానికి ఎ÷-లాన్ చేసినట్లు తేల్చారు. అధికారులు అరెస్టైన వారిపై ఉగ్రవాద నిరోధక చట్టాల కింద కేసులు నమోదు చేశారు. వారినుంచి డిజిటల్ పరికరాలు, ఇతర ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. ఉగ్రవాద సంస్థతో దేశవ్యాప్త సంబంధాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్నికల నిర్వహణలో మీడియా పాత్ర కీలకం

### కేంద్ర ఎన్నికల సంఘం జాతీయ సదస్సు

**న్యూఢిల్లీ, జూలై 3:** స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికల నిర్వహణలో మీడియా, ప్రజాసంబంధాల అధికారుల పాత్ర అత్యంత కీలకమని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా, కమ్యూనికేషన్ నోడల్ అధికారుల జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలోని 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 240 మంది జిల్లా ప్రజాసంబంధాల అధికారులు పాల్గొన్న ఈ సదస్సులో తెలంగాణ సమాచార, పౌరసంబంధాల శాఖకు చెందిన జిల్లా ప్రజాసంబంధాల అధికారులు, మీడియా, సోషల్ మీడియా నోడల్ అధికారులు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణలో కమ్యూనికేషన్ పాత్ర, మీడియా నిర్వహణ, ఎన్నికల చట్టాలు, డిజిటల్ సాంకేతికత వినియోగం, సోషల్ మీడియా సవాళ్లు, తప్పుడు ప్రచారాల నియంత్రణ, ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేసే విధానాలపై ఎన్నికల సంఘం అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం విడుదల చేసే అధికారిక సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయడంతో పాటు అపోహలు, దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత కమ్యూనికేషన్ అధికారులపై ఉందని ప్రధాన ఎన్నికల కమిషనర్ పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, పౌరసత్వ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగా అర్హులైన భారతీయ పౌరుల పేర్లు మాత్రమే ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఫారం-17సీ, రాజ్యాంగంలోని ఆర్టికల్-324 కింద ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలు, ఎన్నికల ప్రచార నిబంధనలు, పెయిడ్ న్యూస్ నియంత్రణ, కృత్రిమ మేధ వల్ల ఎదురవుతున్న సవాళ్లు వంటి అంశాలపై సీనియర్ అధికారులు ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ సదస్సులో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారుల కార్యాలయం నుంచి అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎస్. శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రసన్నరాజ్, తెలంగాణ మీడియా అకాడమీ సంయుక్త సంచాలకులు యు. వెంకటేశ్వరరావు, సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులు ఎం. కిరణ్మయి, ఏ. వనజతో పాటు పలువురు జిల్లా ప్రజాసంబంధాల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# పార్లమెంట్ సమావేశాలపై కసరత్తు!

ఈ నెలాఖరులో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే మరోమారు మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను పెట్టే యోచనలో కేంద్రం ఉంది. అయితే గత సమావేశాల్లో ఈ రెండు బిల్లులు వీగిపోయాయి. అయినా కేంద్రం తన పట్టును విడవకుండా ముందుకు సాగాలన్న యోచన లో ఉంది. ఈ బిల్లులు పాస్ కావాలంటే మూడోవంతు మెజార్టీ అవసరం. అందుకుత తగ్గ కసరత్తు చేస్తున్నట్లుగా ఉంది. ఇదే సందర్భంలో అన్ని పార్టీలతో చర్చించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. అందరి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాలన్న ఆనవాయితీని బిజెపి ఎప్పుడో విడనాడింది. గతంలో సమస్యలు లేదా బిల్లులకు సంబంధించి ముందస్తు అఖిపలక్ష సమావేశాలు జరిగేవి. కానీ అలాంటి ఆనవాయితీని బిజెపి పాటించడం లేదు. దాదాపు 12 ఏళ్లుగా ఏకాభిప్రాయ సాధనలో మోడీ ఏనాడూ ప్రయత్నం చేయలేదు. ఇకపోతే ఏం జరుగుతుందో కూడా ప్రతిపక్షాల ఊహకు కూడా అందడం లేదు. ఈ క్రమంలో రేపటి బిల్లులను ఎప్పుడు, ఎలా ప్రవేశ పెడతారన్నది కేవలం మోడీ, అమిత్ షాలకు మాత్రమే తెలిసి ఉంటుంది. కేంద్రమంత్రులు, బిజెపి నేతలకు కూడా వీటిపై సమాచారం ఉండకపోవచ్చు. ఇలా గోప్యత పాటించడం వల్ల వచ్చే లాభం ఏమిటన్నది కూడా వారికే తెలుసు. ఇకపోతే పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కావచ్చని చూచాయగా తెలుస్తోంది. ఇదే సమయంలో సమావేశాలకు ముందుగానే మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ఉంటుందని సమాచారం వస్తోంది. దీంతో ఎవరు ఉంటారు, ఎవరు పోతారన్న లెక్కల్లో ఎంపిలు ఉన్నారు. ఇది కూడా మోడీ, అమిత్ షాల కనుసన్నల్లోనే జరుగుతుందనడంలో సందేహం లేదు. అందుకే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంటే దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందుగానే ఈ మార్పులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, కొన్ని కీలక మంత్రిత్వ శాఖల్లో కొత్త నాయకులకు చోటు కల్పించడమే లక్ష్యంగా ప్రధాని మోడీ వ్యూహరచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వరుసగా ప్రధాని మోడీ, అమిత్ షాలు వేర్వేరుగా రాష్ట్రపతిని కలవడం ఈ వార్తలకు బలం చేకూరింది. బీజేపీ సంస్థాగత బృందంలో కూడా నితిన్ నబిన్ నేతృత్వంలో సమూల మార్పులు చేసేందుకు పార్టీ అగ్ర నాయకత్వం జాబితాను ఖరారు చేసింది. ప్రభుత్వంతో పాటు పార్టీలో కూడా సమర్థులైన వారికి బాధ్యతలు అప్పగించే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ పనితీరును మరింత వేగవంతం చేసేందుకు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండబోతున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విద్యాశాఖ బాధ్యతలు అప్పగించి, ఆ స్థానంలో శక్తికాంత దాస్‌ను తీసుకురావచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అనురాగ్ ఠాకూర్ తిరిగి మంత్రివర్గంలోకి వచ్చే అవకాశం బలంగా ఉంది. పరీక్షల లీకేజీలు, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని ప్రధాని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేందర ప్రధాన్‌ను తప్పించే అవకాశాలు కూడా లేకపోలేదు. మరోవైపు పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రా వంటి మంత్రులు పార్టీ సంస్థాగత బాధ్యతల్లోకి వెళ్లగా, జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టు స్థానాల్లో కొత్త ముఖాలను కేబినెట్లోకి తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్,పంజాబ్ రాష్ట్రాల నుంచి మరికొందరు సమర్థ నేతలను మంత్రివర్గం లోకి తీసుకునే అవకాశం ఉంది. బెంగాల్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో అక్కడి ఎంపీలకు ప్రాధాన్యత దక్కవచ్చు. శివసేన రెబెల్ వర్గం నుంచి ఒకరిద్దరికి, ముఖ్యంగా శ్రీకాంత్ షిండేకు అవకాశం లభించవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆప్ రెబెల్ ఎంపీలు రాఘవ్ చద్దా లేదా అశోక్ మిట్టల్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. రానున్న రోజుల్లో జరగనున్న కీలక రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ మార్పులు దేశ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ త్వరలో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉండడంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లోనూ మార్పులు ఉండవచ్చు.ముఖ్యంగా తెలంగాణలో ఉన్న ఇద్దరిలో మార్పు ఉంటుందా అన్న చర్చకూడా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌కు మరో కేంద్రమంత్రి పదవి దక్కనుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే టిడిపి నుంచి ఇద్దరు, బిజెపి నుంచి ఒక్కరు కేబినేట్‌లో ఉన్నారు. ఇప్పటికే ఏపీ నుండి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, మరో అదనపు పదవిని టీడీపీకి కేటాయించే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బలంగా ఉండటంతో, కేంద్రంలో మరిన్ని అవకాశాలు దక్కేలా చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు. ఒకవేళ మూడో పదవి వస్తే, అది టీడీపీ ఖాతాలోకే వెళ్తుందా లేక జనసేనకు వెళుతుందా, లేక బిజెపికే వెళుతుండా అన్నది చూడాలి. పరిణామం రాష్ట్ర అభివృద్ధికి, కేంద్రంతో సత్సంబంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. మరోవైపు, సామాజిక సమీకరణాలను బట్టి నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మారవచ్చు. మహిళా కోటాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరును కూడా అధిష్టానం పరిశీలించే అవకాశం ఉంది. కొత్త వారికి అవకాశం ఇస్తారా లేదా అనుభవజ్ఞుల వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. బిజెపికే ఇస్తే మహిళా ఎంపి పురంధేశ్వరికి ఛాన్స్ దక్కవచ్చని అనుకుంటున్నారు. ఒకవేళ ప్రాంతీయ సమతుల్యత పాటిస్తే, ఉత్తరాంధ్ర లేదా రాయలసీమ ప్రాంతాలకు ప్రాధాన్యత పెరిగే ఛాన్స్ ఉంది. మంత్రి పదవి దక్కితే ఏపీకి కేంద్ర నిధులు, ప్రాజెక్టుల విషయంలో మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని పార్టీ భావిస్తోంది. మొత్తంగా ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలు, మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లుల వ్యవహారంతో పాటు మంత్రివర్గ విస్తరణ అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. రానున్న రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. బిజెపి వ్యూహం ఎలా ఉందన్నది కూడా తెలియనుంది.

# పశ్చిమాసియా సంక్షోభంలో రహస్యాలు

- ఇరాన్ నేతలను మట్టుపెట్టాలనుకున్న ఇజ్రాయిల్
- అమెరికా రంగంలోకి దిగడంతో తప్పిన ముప్పు
- న్యూయార్క్ టైమ్ కథనం వెల్లడి



**వాషింగ్టన్, జూలై 3:** పశ్చిమాసియా సంక్షోభంలో సరికొత్త అంతర్జాతీయ రహస్యాలు వెలుగులోకి వచ్చాయి. ఇవి.. అమెరికా, ఇజ్రాయెల్ మైత్రి బీటలు వారిందని చెప్పేందుకు మరింత ఊతమిచ్చేలా ఉన్నాయి. ఇరాన్ అగ్రనేతలు, శాంతి చర్చల ప్రతినిధులైన విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘెర్ గాలిబాఫ్ లపై ఇజ్రాయెల్ వేసిన 'హత్య ప్రణాళిక' ను అమెరికా ముందే పసిగట్టి, ఇరాన్‌ను అప్రమత్తం చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్'ఈ రక్షణ రహస్యాలను బహిర్గతం చేసింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీని ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హతమార్చిన తర్వాత, ఇరాన్ ఉన్నత స్థాయి నాయకత్వాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని ఇజ్రాయెల్ వ్యూహం రచించింది. అయితే, ఏప్రిల్ 8న జరిగిన మొదటి తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత అమెరికాతో అణు, శాంతి చర్చలు జరపడానికి ఇరాన్ తరఫున అరాగ్చీ, గాలిబాఫ్ బాధ్యతలు చేపట్టారు. ఇది ఇజ్రాయెల్‌కు ససేమిరా ఇష్టం లేదు. న్యూయార్క్ టైమ్స్ నివేదిక ప్రకారం.. ఏప్రిల్ 12న ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌తో చర్చలు ముగించుకుని తిరిగి ఇరాన్‌కు విమానంలో ప్రయాణమయ్యారు. గాలిబాఫ్ ప్రయాణిస్తున్న విమానాన్ని కూల్చివేయడానికి ఇజ్రాయెల్‌కు చెందిన రెండు ఫైటర్ జెట్స్ ఇరాక్ మీదుగా ఇరాన్ వైమానిక పరిధిలోకి ప్రవేశించాయి. ఈ నిఘా సమాచారాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ ముందే గుర్తించి, ప్రాంతీయ దేశాల (పాకిస్థాన్, ఖతార్) మధ్యవర్తుల ద్వారా ఇరాన్ ప్రభుత్వానికి అత్యవసర హెచ్చరికలు పంపింది. సమాచారం అందిన వెంటనే ఇరాన్ రక్షణ దళాలు గాలిబాఫ్ విమానాన్ని టెహ్రాన్‌కు వెళ్లకుండా దారి మళ్లించి, ఈశాన్య ప్రాంతంలోని 'మషద్' నగరంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించాయి. ఆ తర్వాత గాలిబాఫ్ రోడ్డు మార్గంలో సురక్షితంగా టెహ్రాన్ చేరుకున్నారు. ఇరాన్‌తో శాంతి చర్చలు జరుపుతున్న సమయంలో ఆ దేశ ప్రధాన దౌత్యవేత్తలను ఇజ్రాయెల్ హతమరిస్తే, చర్చలు పూర్తిగా దారి తప్పి, అమెరికా కూడా నేరుగా ఇరాన్‌తో పెద్ద ఎత్తున యుద్ధంలోకి దిగాల్సి వస్తుందని వాషింగ్టన్ భయపడింది. 'వారినీ చంపేస్తే ఇక మనం శాంతి చర్చలు జరపటానికి ఇరాన్‌లో ఒక్క నేత కూడా మిగలడు' అని పాకిస్థాన్ దౌత్యవేత్తలు కూడా అమెరికాకు స్పష్టం చేశారు. దీంతో అమెరికా స్వయంగా రంగంలోకి దిగి ఇజ్రాయెల్‌ను వెనక్కి తగ్గాలని ఆదేశించిందని కూడా సదరు నివేదిక వెల్లడించింది. ఇదిలా ఉంటే, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2025లో జరిగిన 12 రోజుల యుద్ధంలో, అలాగే ఈ ఏడాది జరిగిన ఘర్షణల్లో ఇరాన్ భూగర్భ బంకర్లపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల శిథిలాల నుంచి గాలిబాఫ్ రెండుసార్లు ప్రాణాలతో బయటపడ్డారు.ఇక, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య ఇటీవల కాలంలో తీవ్రమైన విభేదాలు రావడానికి ఈ ఘటనే పునాది అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతేకాదు, ఇజ్రాయెల్‌కు ఇష్టం లేకపోయినప్పటికీ, అమెరికా.. ఇరాన్‌తో విడిగా చర్చలు జరిపి 14 అంశాల అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవడం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# ఉగ్రవాదాన్ని ఎగదోయడం మానుకోండి

## సింధుజలాలపై పాక్ ప్రేలాపనలపై భారత్ మండిపాటు



**న్యూఢిల్లీ, జూలై 3:** సింధు జలాల్లో తమ వాటా తీసుకొంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ పాక్ మంత్రి ముసాదిక్ మాలిక్ చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. దాయాది దేశం ఉగ్రవాదాన్ని ఎగదోయడం, ఉగ్ర కార్యకలాపాలను ప్రోత్సహించడం మానుకొనే వరకు సింధు జలాల నిలిపివేత కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఉగ్రవాదం విషయంలో తమ వైఖరిలో ఎటువంటి మార్పు లేదని తేల్చి చెప్పింది. 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందం చట్టబద్ధమైన నిబంధనలు కట్టుబడి ఉంటుందని తెలిపింది. దానిని ఏకపక్షంగా నిలిపివేయడం గానీ.. సవరించడం గానీ సాధ్యం కాదని పాక్‌కు చురకలు అంటించింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని పాక్ విడనాడాలని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జయస్‌వాల్ సూచించారు. సింధు జలాల నియంత్రణకు భారత్ యత్నిస్తోందని.. పాక్‌లోకి చుక్క నీరు కూడా ప్రవహించకుండా పొరుగు దేశ ప్రధాని అడ్డుకుంటున్నారని ఇటీవల పాక్ మంత్రి ముసాదిక్ ఆరోపించారు. తమ నీటి హక్కులకు ముప్పు వాటిల్లితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మరో మంత్రి అట్టావుల్లా తరార్ మాట్లాడుతూ.. నీటి అంశం తమ దేశ జాతీయ భద్రతలో కీలక భాగమని పేర్కొన్నారు. సింధూ జలాల ఒప్పందం చట్టబద్ధంగా అమల్లోనే ఉందని, దాన్నెవరూ రద్దు చేయలేరంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. ఈ క్రమంలోనే విదేశాంగ శాఖ దీటుగా స్పందించింది. అఫ్గానిస్థాన్ పై పాకిస్థాన్ సైనిక దాడులను భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. అఫ్గాన్ సార్వభౌమత్వానికి భారత్ మద్దతు కొనసాగిస్తుందని రణధీర్ జయస్‌వాల్ పునరుద్ఘాటించారు. మానవతా సాయం, అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా ఆ దేశంతో సంబంధాలు కొనసాగుతున్నాయన్నారు. ఇటీవల వెనెజువెలాలో అనుమానాస్పద స్థితిలో భారత నావికుడు రాకేశ్ చౌహాన్ మృతిచెందిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. మృతదేహంలో అవయవాలు మాయం కావడం గురించి అక్కడి అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది.

# స్వాధీనం చేసుకున్న విమానం వేలం


- దేశంలో తొలిసారిగా ఈడీ సంచలన నిర్ణయం




**హైదరాబాద్, జూలై 3:** దేశంలోనే తొలిసారిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800 విమానాన్ని విక్రయించేందుకు ఈ నెల 1న ఎంఎస్‌టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ.3 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. హాకర్ 800 విమానం అనేది అంతకుముందు ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్‌దీప్ కుమార్‌కు చెందినది. అయితే అమర్‌దీప్ నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి పాల్పడినట్టు ఈడీ తేల్చింది. దర్యాప్తులో భాగంగా ఈ విమానాన్ని గత మార్చి 7న ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత.. చట్టపరమైన ప్రక్రియ ద్వారా, పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ అనుమతితో దీనిని ఈ-వేలంలో రూ.3 కోట్లకు విక్రయించారు. ఈ సొమ్మును బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నారు. కాగా.. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ అవ్వగా, దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఈడీ తెలిపింది. అయితే.. ఈడీ స్వాధీనం చేసుకున్న విమానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో విక్రయించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఆస్తుల విక్రయ ప్రక్రియలో పారదర్శకత, పోటీ వాతావరణం కల్పించడం సహా ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచే దిశగా ఈ విధానం ఉపయుక్తమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

- యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి
- యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు



**న్యూఢిల్లీ, జూలై 3:** అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగంని నేరుగా దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతా సూచనలను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుంబాలకు, యువతకు ఉపాధినిస్తుందన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బాధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

# వరుణుడి కరుణ కోసం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** పెనుబల్లి మండలంలోని సూరయ్య బంజరతండాలో సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ గ్రామస్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లిస్తూ బొడ్డురాయికి జలాభిషేకం చేసి, మైసమ్మ తల్లికి పూజలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, చెరువులు నిండి పంటలు పుష్కలంగా పండాలని ప్రార్థించారు. గ్రామ ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. వర్షాభావ పరిస్థితులు తొలగి వ్యవసాయ పనులు ఊపందుకోవాలని, రైతుల కష్టాలు గట్టెక్కాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. గ్రామీణ సాంప్రదాయాలను అనుసరిస్తూ నిర్వహించిన ఈ ప్రత్యేక పూజల్లో తండా ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని 31వ వార్డులో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్లు , డ్రైనేజీ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూషతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం అదే వార్డులో నిరుపేద కుటుంబాలకు చెందిన నాసియా, సమీనా పర్వీన్లకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల ను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తోందని అన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి రోహిత్, 31వ వార్డు కౌన్సిలర్ రషీదుల్ హక్, 33వ వార్డు కౌన్సిలర్ మెహబూబ్, 2వ వార్డు కౌన్సిలర్ నియామత్, కాంగ్రెస్ నాయకులు రఫీ, అల్మాస్, రజాక్, అజ్జు, దస్తగిరి, మోసిన్, సుభాష్, ఖమర్, అలీం, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు సోకే వ్యాదుల పట్ల అప్రమత్త ంగా ఉండాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ రూపావత్ వెంకటరాం అన్నారు. ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఉచిత 'ముద్ద చర్మ వ్యాధి' నివారణకు పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు సోకే ప్రమాదకరమైన 'ముద్ద చర్మ వ్యాధి' (లంపీ స్కిన్) నివారణకు ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు తమ పశువులకు రక్షణ కల్పించేందుకు ముందుకు రావాలని కోరారు. గ్రామంలోని పాడి రైతులందరు తమ ఆవులను, ఎద్దులను తప్పనిసరిగా టీకా కేంద్రానికి తీసుకువచ్చి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు

# ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

- **సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరీ చిరంజీవి**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా సరిపడా యూరియా బస్తాలు సరఫరా చేయాలని, అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆసిఫాబాద్ మండల సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం ఆసిఫాబాద్ మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎ. చిరంజీవికి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరీ చిరంజీవి మాట్లాడుతూ ప్రస్తుతం పంటల సాగు అత్యంత కీలక దశకు చేరుకుందని, అయితే కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరతతో పాటు ఆన్ లైన్ యాప్ బుకింగ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రైతులు గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ప్రైవేట్ ఎరువుల దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ రేట్లకు యూరియా విక్రయిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, యూరియా బస్తాలతో పాటు రైతులకు అవసరం లేని ఇతర ఉత్పత్తులను కూడా బలవంతంగా అంటగడుతూ ఆర్థికంగా నష్టపరుస్తున్నారని మండిపడ్డారు.రైతులకు సకాలంలో ఎరువులు అందకపోతే పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల్లో తక్షణమే ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువకు అమ్మే వ్యాపారులపై ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి దుకాణంలో ధరల జాబితా, నిల్వల వివరాలు, ఫిర్యాదుల నంబర్లను స్పష్టంగా ప్రదర్శించేలా చూడాలని, ఆన్ లైన్ బుకింగ్ సమస్యలను పరిష్కరించి రైతులకు సులభంగా యూరియా అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు పిడుగు శంకర్, తాళ్లపల్లి దివాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి

**డీవైఎఫ్ఐ డిమాండ్**



**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ :** ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ మండల విద్యాధికారి వసాల ప్రభాకర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు గోడిసెల కార్తీక్, గేడం టికనంద్ మాట్లాడుతూ మండలంలోని శ్రీ చైతన్య, అరుణోదయ, శాంతినికేతన్, విఐపి, విశ్వశాంతి, ఫాతిమా కాన్వెంట్, సెంట్ క్లారిట్ వంటి పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. పేరెంట్స్ కమిటీలు వేయకుండా, ఫీజుల పట్టికలు పెట్టకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా స్కూళ్ల లోనే విచ్చలవిడిగా బుక్స్, యూనిఫాం, షూ, బెల్టులు అమ్ముతూ తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రైవేట్ పాఠశాలలపై పూర్తి విచారణ జరిపి, ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని మరియు స్కూళ్లలో వ్యాపారాలు సాగకుండా చూడాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని ఉల్ల ఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# కన్నెపల్లి ఉప సర్పంచ్ భర్త దినేష్ మృతి

- **భౌతికకాయానికి నివాళులర్పించిన రాష్ట్ర, జిల్లా ఉప సర్పంచుల సంఘం నాయకులు**



**ఉద్యమ కెరటం, తిర్యాని :** తిర్యాని మండలం కన్నెపల్లి గ్రామ ఉప సర్పంచ్ కవిత భర్త దినేష్ చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అకాల మరణం చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం నాయకులు కన్నెపల్లి గ్రామానికి చేరుకుని దినేష్ భౌతికకాయానికి ఘన నివాళులర్పించారు. ఉప సర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ , ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు దీపక్ ముండే పాల్గొని దినేష్ పార్థివ దేహంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఉప సర్పంచ్ కవితని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ మాట్లా డుతూ కవిత కుటుంబానికి రాష్ట్రంలో ఉన్న ఉప సర్పంచులు అందరూ ఎల్ల వ్వుడూ అండగా ఉంటారని, అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దుద్యాల రాజిరెడ్డి , పెద్దపల్లి జిల్లా కోఆర్డినేటర్ జంగ అనిల్ , వార్డు సభ్యుల జిల్లా ఇన్చార్జ్ జావిద్ , తిర్యాని మండల ఇన్చార్జ్ చెని కుమార్ , వివిధ గ్రామాల ఉప సర్పంచులు ముక్కెర సరిత (గోయెగాం), గడ్డి హరిత అశోక్ (సుంగపూర్), సెడ్మాకి మోహన్ (కైరీగూడ), సోయం కట్టి (గడలపల్లి), తిరుపతి (మాణిక్య పూర్), కనక శ్రీకాంత్ (మంగి), మడావి నాందేవ్ (చింతపల్లి), ఆత్రం భీము (దేవాయిగుడా), బోర్ కుంట యువరాజ్ (ఉల్లి పిట్ట), పెందూర్ వనిత దయాకర్ (రోంపల్లి), కుడ్మెత రవీందర్ (మెస్రం గూడా), సంతోష్ (బాంబర), విజయ్ (కోమటిగూడ) తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక యంత్రాలతో పనుల నిర్వహణ వేగవంతం

- **12 టన్నుల సామర్థ్యంతో నూతన ఎస్కార్ట్ క్రేన్ ప్రారంభించిన జీఎం**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఆధునిక యంత్రాల వినియోగంతో పనుల నిర్వహణ మరింత వేగవంతంగా, సమర్థవంతంగా సాగడంతో పాటు భద్రతా ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ చింతల శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని జేవీఆర్ ఓసీ లైట్ మోటార్ వెహికల్ (ఎల్ ఎంవి) సెక్షన్లో సుమారు రూ.22.69 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 12 టన్నుల సామర్థ్యం గల నూతన ఎస్కార్ట్ క్రేన్ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన క్రేన్ అందుబాటులోకి రావడంతో వాహనాల మరమ్మతులు, భారీ యంత్రాల నిర్వహణ పనులు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ ఎన్వీఆర్ ప్రహ్లాద్, ఎస్ఓ టు జీఎం బొల్లం శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ కె.సోమశేఖర్ రావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, ఎస్ఓఎం బి.రాజేశ్వరరావు, మేనేజర్ (ఆపరేషన్స్) జి.కళ్యాణ్ రామ్, సేఫ్టీ ఆఫీసర్ ఎస్.గోవింద్, ఎస్ఈ ముక్కా శ్రీను, డివిజనల్ ఇంజనీర్ పి.గోపి, కాలరీ ఇంజనీర్ జగదీశ్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.సుధాకర్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు, సంక్షేమ అధికారులు దారా కావ్య, కె.శ్రీనివాస్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని నేరడిగొండ గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటర్లుగా ఉన్న వారు తమ పేరు, చిరునామా తదితర వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయాల్సిన వారు, పేర్లు తొలగిపోయిన వారు సంబంధిత బీఎల్ఓ, బీఎల్ఏలను సంప్రదించి నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ఈ ప్రక్రియలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, సందేహాలు ఉంటే సంబంధిత అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్, నాయకులు షేక్ బాబా, మాజీ వార్డు సభ్యుడు రాథోడ్ రాజశేఖర్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బెజ్జాల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బెజ్జాల గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. బెల్ల ంపల్లిఎమ్మెల్యే గడ్డం వి నోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు నర్సాపూర్ గ్రామ సర్పంచ్ ప్రభాత్ రావు, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గంగపటేల్ గూడెంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద రూ.5 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రహదారి పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల సహకారంతో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఉప సర్పంచ్ పర్వత్ రావు, మాదారం, రాజీవ్నగర్ ఉప సర్పంచులు సూరం దామోదర్ రెడ్డి, కాపర్తి సుభాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భగవంతరావు, లచ్చు పటేల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్
- 15వేల మందితో సత్తుపల్లిలో భారీ వనమహోత్సవ ర్యాలీ




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలో శుక్రవారం సుమారు 15వేల మందితో రాష్ట్రంలోనే తొలిసారిగా భారీ వనమహోత్సవ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు, యువత, ప్రజలు పాల్గొన్న ఈ కార్యక్రమం రాష్ట్ర చరిత్రలోనే విశిష్ట ఘట్టంగా నిలిచింది. జేవీఆర్ కళాశాల మైదానంలో ప్రారంభమైన కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. జేవీఆర్ కళాశాల నుంచి పాత సెంటర్ మీదుగా సాగిన భారీ ర్యాలీలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జానపద కళాకారుల ప్రదర్శనలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, మట్టా దయానంద్ చిన్నారులతో కలిసి ర్యాలీలో పాల్గొని వారిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ ఇంత భారీ స్థాయిలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్న కార్యక్రమానికి తాను హాజరు కావడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. సమాజంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గం విద్య, అభివృద్ధి, సామాజిక చైతన్యంలో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని అన్నారు. భారీ స్థాయిలో నిర్వహించిన ఈ వనమహోత్సవ ర్యాలీ రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపును సంపాదించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్, డీఎఫ్వో, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రమాదాల బాటలో ప్రయాణం

- గుంతలమయంగా మారిన కెరమెరి మెయిన్ రోడ్డు

**ఉద్యమ కెరటం, కెరమెరి:** కెరమెరి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రహదారిపై భారీ గుంతల్లో వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తుండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ పరిస్థితిపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. రహదారిపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో రోడ్డు ఎక్కడ ఉందో, గుంత ఎక్కడ ఉందో గుర్తించడం కష్టంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ఈ గుంతల్లో పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. పలువురు స్వల్ప గాయాలతో బయటపడగా, ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, మార్కెట్కు వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడంతో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఈ రహదారిని ఉపయోగిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను తరలించే రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సేవల కోసం వచ్చే అంబులెన్సు సైతం ఈ రహదారిపై నెమ్మదిగా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో రహదారి పరిస్థితి మరింత దయనీయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చి వాహనదారులకు ఉపశమనం కల్పించాలని, అలాగే నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ సౌకర్యాలు ఏర్పాటు చేసి శాశ్వత ప్రాతిపదికన నాణ్యమైన రహదారిని నిర్మించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



# నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వంటి వెక్టర్ జనిత వ్యాధుల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా టాస్క్ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ వెక్టర్ జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, భవిష్యత్తు కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల ద్వారా వెక్టర్ జనిత వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీ, వార్డు కార్యాలయంలో టోల్ఫ్రీ నం. 9491103108ను ప్రదర్శించాలని తెలిపారు. పట్టణ ప్రాంతాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, జవాన్లు, శానిటేషన్ సిబ్బంది, పీడీఎంఏ సిబ్బంది సహకారంతో హాట్స్పాట్లను గుర్తించి ముందుగా ఫీవర్ సర్వే, అనంతరం అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా 'డ్రై డే' కార్యక్రమాలను నిర్వహించాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వినియోగం చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో నీరు నిల్వ కాకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలను పీహెచ్సీ వైద్యాధికారులు తరచూ సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, వంటశాలలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించడంతో పాటు అక్కడ భోజనం చేసి నాణ్యతను నిర్ధారించాలని స్పష్టం చేశారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ఈనెల 13న ప్రారంభమై 20 వరకు మాప్-అప్ కార్యక్రమంతో కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు అర మాత్రను ఇవ్వాలని, రెండు నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర అందించాలని సూచించారు. మాత్రల పంపిణీ క్లాస్ టీచర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తల ప్రత్యక్ష పర్యవేక్షణలో సురక్షితంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఎంహెచ్ఓ సాధన, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డీఈఓ మాధవి, ప్రోగ్రాం అధికారి సుమలత, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, నీటి సరఫరా, సంక్షేమ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో రైస్ మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు, టాస్క్ఫోర్స్ ఓఎస్డీ శ్రీధర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా కేటాయించి సీఎంఆర్ లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిపారు. రైస్ మిల్లర్లు అధికారులతో సమన్వయం చేసుకుని లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్లో ఉన్న చెల్లింపులను త్వరగా పూర్తి చేయడంతో పాటు, డీలర్లకు కేటాయించిన మేరకు బియ్యం సరఫరాను వేగవంతం చేయాలని ఆదేశించారు. డిఫాల్టర్లుగా ఉన్న మిల్లర్లు తమ బకాయిల్లో కనీసం 70 శాతం మొత్తాన్ని వెంటనే చెల్లించాలని, ఆగస్టు 31వ తేదీలోపు సీఎంఆర్ డెలివరీ పూర్తి చేసేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్లో రూ.1.79 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- తొమ్మిది వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు భూమిపూజ

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణ సమగ్రాభివృద్ధిలో భాగంగా రూ.1.79 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులకు శుక్రవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ యూఐడీఎఫ్ పథకం కింద ఇప్పటికే ఆదిలాబాద్ పట్టణంలో రూ.18.70 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో సుమారు రూ.150 కోట్ల విలువైన మరిన్ని అభివృద్ధి పనులను పట్టణానికి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో ఉన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తూ అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# కిసాన్ క్రాంతి పథకంతో రైతులకు చేయూత

వంద శాతం రాయితీపై పత్తి విత్తనాల పంపిణీ




**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** కిసాన్ క్రాంతి పథకంతో ప్రభుత్వం రైతులకు చేయూతనిస్తుందని మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్ అన్నారు. కిసాన్ క్రాంతి పథకం కింద ఎంపికైన రైతులకు శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వంద శాతం రాయితీపై పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మంది రైతులు ఎకరానికి తక్కువ మొక్కల సాంద్రతతో పత్తి సాగు చేయడం ద్వారా దిగుబడి తగ్గడంతో పాటు సాగు ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. రైతులు అధిక సాంద్రత పద్ధతిలో స్వల్పకాలిక పత్తి రకాలను సాగు చేయడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే ఉత్పాదకత పెరిగి రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం క్లస్టర్ పరిధిలోని పత్తి రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రమ్య, దీపక్, సాయిరాం, జ్యోతి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు



**ఉద్యమ కెరటం, తాండూర్:** గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తాండూర్ ఎంపీఓ జి.అనిల్ కుమార్ సూచించారు. శుక్రవారం తాండూర్ మండలం రేచిని గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నాలుగు రకాల చెత్త డబ్బాల వినియోగంపై అవగాహన కల్పించాలని, గ్రామంలో ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తడి చెత్తతో కంపోస్ట్ ఎరువును తయారు చేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. అలాగే ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రేచిని గ్రామ సర్పంచ్ పోతురాజుల రాంబాయి, ఉప సర్పంచ్ కొడిపాక భీమయ్య, పశువైద్యాధికారి శివప్రసాద్, ఆర్ఐ మురళీధర్ రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ ఆపరేటర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఆరోగ్య పాఠశాల' పుస్తకావిష్కరణ



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలోని రణదివేనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు రూపొందించిన 'ఆరోగ్య పాఠశాల' పుస్తకాన్ని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ శుక్రవారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన, వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో 1 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం ఈ పుస్తకాన్ని రూపొందించారు. పరిశుభ్రత, పోషకాహారం, సహజ ఆరోగ్యం, మాదకద్రవ్యాల నివారణ, సీజనల్ వ్యాధుల నివారణ, స్ఫూర్తిదాయక జీవితాలు వంటి అంశాలను వారంలో ఒక్కో రోజుకు ప్రత్యేకంగా ఇందులో పొందుపర్చారు. ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక 'స్కాచ్ అవార్డు' లభించడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాలలో రూ.8.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఆదర్శ మరుగుదొడ్లను మున్సిపల్ చైర్పర్సన్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోనే ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని అమలు చేయడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని రూపుదిద్దిన జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు. విద్యార్థులు 'ఆరోగ్య పాఠశాల' పుస్తకాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, టీపీఓ సుమలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, కౌన్సిలర్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



## పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదలు, రైతులు, కార్మికులు, యువత, మహిళల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఇచ్చోడ మండలంలోని మాల్యల్ గ్రామంలో గ్రామస్తుల కోరిక మేరకు స్థానిక సర్పంచ్ మెస్రం దేవురావుతో కలిసి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి అధికారులు, స్థానికుల ద్వారా అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెలను ఏర్పాటు చేసి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించి ప్రతి ఇంటికీ చేరవేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. అంతకుముందు మాల్యల్ గ్రామానికి చేరుకున్న ఆడే గజేందర్కు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక సహకారం అందించాలని కోరుతూ గ్రామస్తులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు..

## ఘనంగా రైతు భరోసా సంబరాలు

### సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**ఉద్యమ కెరటం, భీంపూర్:** తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లో రూ.9 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా భీంపూర్ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రైతు భరోసా సంబరాలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచి, బాణసంచా కాలుస్తూ ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతు భరోసా నిధులను సకాలంలో విడుదల చేసి రైతులకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని అభినందించారు. రైతుల అభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు అందజేయాలి

### తహశీల్దార్ అడా బిర్ షావ్



**ఉద్యమ కెరటం, జైనూర్:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసిన వెంటనే సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్ల కు (బీఎల్ఓ)లకు అందజేయాలని జైనూర్ తహశీల్దార్ అడా బిర్ షావ్ సూచించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ప్రతి ఓటరు తమకు అందిన ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా పూర్తి చేసి, ఎలాంటి ఆలస్యం లేకుండా సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని కోరారు. సమయానికి ఫారాలు సమర్పించడం ద్వారా ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా పూర్తవుతుందని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడానికి ఈ ప్రక్రియ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించి, ఎన్యూమరేషన్ ఫారాలను త్వరగా పూర్తి చేసి సమర్పించాలని కోరారు.

## రాజు గోండుల కోటాను దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గిరిజనుల చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన ఉట్నూర్ రాజు గోండుల కోటాను పునరుద్ధరించి దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని చారిత్రక రాజు గోండుల కోటాను ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందుతో కలిసి శుక్రవారం సందర్శించారు. కోటా పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం ఐటిడీఏ పీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గోండు రాజుల చరిత్ర, గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఈ కోటా చారిత్రకతకు ఎలాంటి భంగం కలగకుండా పునర్ నిర్మించాలని సూచించారు. ఆధునిక సౌకర్యాలతో దేశ నలుమూలల నుంచి పర్యాటకులను ఆకర్షించేలా సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. భావితరాలకు గిరిజనుల గొప్ప చరిత్రను పరిచయం చేసే విధంగా కోటాలో అత్యాధునిక మ్యూజియం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో గోండు రాజుల వంశ చరిత్ర, పాలనా విధానం, సంస్కృతి, సాంప్రదాయాలు, వారసత్వ ఆనవాళ్లు, పురాతన వస్తువులు, చారిత్రక ఆధారాలను ప్రతిబింభించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా కోటా ప్రాంగణంలో గిరిజన సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదిక, గిరిజన హస్తకళలు, సాంప్రదాయ ఉత్పత్తుల విక్రయానికి మార్కెటింగ్ స్టాల్స్, చిన్నారుల కోసం పార్కు, క్రీడా ప్రాంగణం, సందర్శకుల కోసం విశ్రాంతి భవనాలు, రూఫింగ్ షెడ్లు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, ఆకర్షణీయమైన ఉద్యాన వనాలు, విద్యుద్దీపాల అలంకరణ, పచ్చదనం పెంపు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. సందర్శకులు కోటా చరిత్రను సులభంగా తెలుసుకునేలా సమాచార ఫలకాలు, దిశానిర్దేశక బోర్డులు, డిజిటల్ సమాచార వ్యవస్థలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కోటా అభివృద్ధి ద్వారా స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఉట్నూర్ ప్రాంతం పర్యాటక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు మాట్లాడుతూ రాజు గోండుల కోటాను సుందరీకరించి జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావు, అదనపు డైరెక్టర్ నరసింహులు, డీడీ సాగర్, ఓఎస్డీ రాజు, పర్యాటక శాఖ అధికారి రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తానాజీ, ఏపీఓ పీవీటీజీ ఆత్రం భాస్కర్, డిప్యూటీ డీఈఓ చందన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## భూ సర్వేతో రెవెన్యూ గ్రామాల హద్దులు స్పష్టం





- **భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**
- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, రెవెన్యూ గ్రామాల హద్దులను ఖరారు చేయడం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో నిర్వహించిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు మండల తహశీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీఓ మోహన్లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సుల్లో అందిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రెవెన్యూ రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరిస్తామని తెలిపారు. ముందుగా ప్రతి గ్రామానికి సంబంధించిన భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించడం ద్వారా ప్రభుత్వ భూములు, పట్టా భూములపై స్పష్టత వస్తుందని అన్నారు. పట్టా ఉండి మోకాలో లేని భూములు, మోకాలో ఉండి పట్టా లేని భూముల విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. భూ సర్వేలో ఆధునిక మ్యాపింగ్ విధానాన్ని వినియోగించడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలను నివారించవచ్చని, అవసరమైతే న్యాయపరమైన పరిష్కారాలకు కూడా ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియలో సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండలంలోని కేజీబీవీని సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు నాణ్యమైన విద్య బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తదుపరి కోటపల్లి మండల కేంద్రంలో అమృత్ 2.0 పథకం కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కేజీబీవీ, తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి సదస్సుల్లో అందిన దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ముమ్మరంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

**ఉద్యమ కెరటం, సిరికొండ:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బోథ్ నియోజకవర్గంలోని సిరికొండ మండలంలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం సిరికొండ మండలంలోని సుంకిడి, కోసుపటేల్గూడ, పండుగూడ, రాయిగూడ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పర్యటించారు. 157వ బూత్ లెవెల్ ఆఫీసర్, బూత్ లెవెల్ ఏజెంట్ తొడసం భూపతితో కలిసి ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వాటి వివరాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూరించాలి, ఏ వివరాలు నమోదు చేయాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సుంకిడి గ్రామ సర్పంచ్ రాథోడ్ గణపతి స్థానిక యువకులు, బీఎల్ఏతో కలిసి గ్రామంలో 200కు పైగా ఎన్యూమరేషన్ దరఖాస్తులను పూర్తి చేయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పూర్కా జగన్, చవాన్ ప్రకాష్, స్థానిక నాయకులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



## ఊసేగాంలో తీవ్ర తాగునీటి సమస్య

- **బావుల వద్ద గంటల తరబడి నిరీక్షిస్తున్న గ్రామస్తులు**



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని ఊసేగాం గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గ్రామంలో సరిపడా మంచినీటి సరఫరా లేకపోవడంతో మహిళలు, యువకులు, చిన్నారులు ప్రతిరోజూ బావుల వద్ద గంటల తరబడి వేచి ఉండి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామంలో నీటి వనరులు తగ్గిపోవడం, పైప్లైన్ ద్వారా నీటి సరఫరా సక్రమంగా అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక బిందె మంచినీటి కోసం కూడా ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కొరత కారణంగా ప్రజల దైనందిన జీవనం అస్తవ్యస్తంగా మారిందని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ట్యాంకర్ల ద్వారా అత్యవసరంగా తాగునీటిని సరఫరా చేయడంతో పాటు గ్రామానికి నిరంతర మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్, జులై 3 :** గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు మళ్లీ పెరుగుదల బాట పట్టాయి. బుధవారం వరకు వరుసగా తగ్గిన పసిడి ధరలు గురువారం నుంచి తిరిగి పెరగడం ప్రారంభమైంది. శుక్రవారం కూడా అదే ధోరణి కొనసాగడంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి మరోసారి అదనపు భారం పడింది. శుక్రవారం ఉదయం నమోదైన ధరల ప్రకారం హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,000కు చేరుకుంది. ఇది గురువారం ధరతో పోలిస్తే రూ.2,450 పెరిగింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,750గా నమోదై ఒక్కరోజులోనే రూ.2,250 పెరిగింది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,10,250గా కొనసాగుతోంది. వెండి ధర కూడా ఒక్కసారిగా పెరిగింది. కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2,60,000గా ఉండగా, గురువారం ధరతో పోలిస్తే రూ.10 వేల మేర పెరుగుదల నమోదైంది. తెలంగాణలో హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,000గా ఉంది. 22 క్యారెట్ల బంగారం రూ.1,34,750, 18 క్యారెట్ల బంగారం రూ.1,10,250గా కొనసాగుతోంది. ఇదే ధరలు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో కూడా నమోదయ్యాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో బంగారం ధర అత్యధికంగా ఉంది. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,560, 22 క్యారెట్ల బంగారం రూ.1,37,000గా ఉంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రూ.1,47,150, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళలో రూ.1,47,000గా కొనసాగుతోంది. అహ్మదాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,050గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, డాలర్ మారకం విలువలో హెచ్చుతగ్గులు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడిదారుల కొనుగోళ్ల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు మారుతున్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ పరిణామాలను బట్టి పసిడి ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు.

# న్యాక్ ప్యాకేజింగ్ ఐపీఓకు భారీ స్పందన




**ముంబై, జులై 3:** భారతీయ ప్రాథమిక షేర్ల మార్కెట్‌లో కొత్త కంపెనీల షేర్ల విక్రయాలకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన కొనసాగుతోంది. తాజాగా న్యాక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభించిన షేర్ల విక్రయం చివరి రోజైన శుక్రవారం భారీగా దరఖాస్తులు అందుకుంటోంది. జులై 1న ప్రారంభమైన ఈ షేర్ల విక్రయం జులై 3తో ముగియనుండగా, చివరి రోజు మధ్యాహ్నానికే పలు విభాగాల్లో అనూహ్య స్థాయిలో స్పందన లభించింది. మధ్యాహ్నం 12 గంటల సమయానికి ఈ షేర్ల విక్రయం మొత్తం మీద 18 రెట్లకు పైగా దరఖాస్తులు అందుకోగా, మధ్యాహ్నం తర్వాత అది 22 రెట్లకు మించి చేరినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సంస్థాగతేతర పెట్టుబడిదారుల విభాగంలో అత్యధిక స్పందన నమోదైంది. ఈ విభాగంలో కేటాయించిన వాటా ఇప్పటికే 50 రెట్లకు పైగా భర్తీ అయింది. అర్హత కలిగిన సంస్థాగత పెట్టుబడిదారుల విభాగంలో 10 రెట్లకు పైగా, సాధారణ రిటైల్ పెట్టుబడిదారుల విభాగంలో సుమారు 8.7 రెట్లకు పైగా దరఖాస్తులు నమోదయ్యాయి. సాయంత్రం దరఖాస్తుల గడువు ముగిసేలోపు ఈ సంఖ్యలు మరింత పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఈ షేర్ల విక్రయం ద్వారా కంపెనీ మొత్తం రూ.439.50 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.380 కోట్ల విలువైన కొత్త షేర్ల జారీతో పాటు, రూ.59.50 కోట్ల విలువైన ఇప్పటికే ఉన్న షేర్ల విక్రయం కూడా ఉంది. ఒక్కో షేరు ధరను రూ.161 నుంచి రూ.170 మధ్య నిర్ణయించారు. కనీసంగా ఒక లాట్‌కు 88 షేర్ల కోసం దరఖాస్తు చేయాల్సి ఉండగా, గరిష్ఠ ధర ప్రకారం రిటైల్ పెట్టుబడిదారుడు కనీసం రూ.14,960 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అనధికారిక మార్కెట్‌లో కూడా ఈ కంపెనీ షేర్లకు మంచి డిమాండ్ కనిపిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఒక్కో షేరుపై రూ.28 నుంచి రూ.32 వరకు అదనపు ధర పలుకుతున్నట్లు సమాచారం. దీంతో షేరు మార్కెట్లో జాబితాలో చేరిన తొలి రోజే సుమారు 16 నుంచి 20 శాతం వరకు లాభం వచ్చే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే ఇవి కేవలం మార్కెట్ అంచనాలు మాత్రమేనని, వాస్తవ ధరలు మార్కెట్ పరిస్థితులను బట్టి మారే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గుజరాత్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న న్యాక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ దేశీయ మార్కెట్‌తో పాటు 71కి పైగా దేశాలకు ప్యాకేజింగ్ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఇటీవల ముగిసిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.823.4 కోట్ల ఆదాయాన్ని, రూ.92.8 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కంపెనీ వ్యాపార విస్తరణ కోసం గుజరాత్‌లో కొత్త తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు వెల్లడించింది.

ప్రముఖ బ్రోకరేజ్ సంస్థలు కూడా ఈ షేర్ల విక్రయానికి అనుకూల అభిప్రాయం వ్యక్తం చేశాయి. కంపెనీ విలువ, ఆర్థిక పనితీరు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

# 'సమాచార' సారథికి జాతీయ గుర్తింపు

## ఢిల్లీ సదస్సుకు ఆసిఫాబాద్ డీపీఆర్ఓ సంపత్ కుమార్
## క్షేత్రస్థాయి పనితీరుకే దక్కిన గౌరవం






**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. మారుమూల, వెనుకబడిన జిల్లాగా భావించే ఆసిఫాబాద్ నుంచి ఒక ప్రభుత్వ అధికారి తన ప్రతిభతో దేశ రాజధాని వేదికగా జరగబోయే అత్యున్నత సదస్సుకు ఎంపికయ్యారు. ఆయనే జిల్లా పౌర సంబంధాల అధికారి (డీ పీ అర్ ఓ) సంపత్ కుమార్. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో రెండు రోజులు నిర్వహించిన 'మీడియా ఆ కమ్యూనికేషన్ అధికారుల జాతీయ సదస్సు'కు ఆయన ఎంపిక కావడంపై జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

### ఐఐఐడీ ఈ ఎం ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి శిక్షణ

భారత ఎన్నికల సంఘానికి చెందిన ప్రతిష్ఠాత్మక శిక్షణా సంస్థ ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలెక్షన్ మేనేజ్‌మెంట్ ఈ సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా సమాచార, ప్రజాసంబంధాల రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న అధికారులను వడపోసి మరీ ఈ సదస్సుకు ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద ఎంపికైన వేళ్లమీద లెక్కపెట్టగల కొద్దిమంది అధికారుల్లో సంపత్ కుమార్ ఒకరు కావడం విశేషం.

### డిజిటల్ వ్యూహాలే అజెండాగా..

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ సమాచార వ్యవస్థను, ఎన్నికల నిర్వహణను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే అంశంపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు. మారుతున్న మీడియా ధోరణులను ఎలా అందిపుచ్చుకోవాలి, నకిలీ వార్తలను అడ్డుకుంటూ, డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు వేగంగా సమాచారాన్ని ఎలా చేరవేయాలి,

ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు అంతర్జాతీయ స్థాయిలో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులు ఏమిటి లాంటి ఎన్నో కీలక అంశాలపై జాతీయ, అంతర్జాతీయ నిపుణులు నిర్వహించే సాంకేతిక సెషన్లలో సంపత్ కుమార్ పాల్గొని అవగాహన పెంపొందించుకున్నారు.

### క్షేత్రస్థాయి పనితీరుకే దక్కిన గౌరవం

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లాంటి భౌగోళికంగా సవాళ్లతో కూడిన ప్రాంతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ఎన్నికల కమిషన్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సంపత్ కుమార్ నిరంతరం శ్రమిస్తున్నారు. ఉన్నతాధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఆయన అమలు చేసిన కమ్యూనికేషన్ వ్యూహాలే ఈరోజు ఆయనను జాతీయ వేదికపై నిలబెట్టాయని తోటి అధికారులు అభిప్రాయపడుతున్నారు.

### జిల్లాకు గర్వకారణం..

"సరిహద్దు జిల్లా అయిన కొమురం భీం ఆసిఫాబాద్ నుంచి ఒక అధికారి జాతీయ స్థాయి సదస్సుకు ఎంపిక కావడం సాధారణ విషయం కాదు. ఇది డి పి ఆర్ ఓ సంపత్ కుమార్ పనితీరుకు దక్కిన గుర్తింపు మాత్రమే కాదు, మన జిల్లాకే గర్వకారణం." అని పలువురు జిల్లా అధికారులు, జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ అరుదైన అవకాశం దక్కించుకున్న డీపీఆర్ఓ సంపత్ కుమార్‌కు జిల్లా అధికార యంత్రాంగం, జర్నలిస్టు సంఘాలు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



# కెరమెరి జడ్పీఎస్ స్కూల్ ముందు 'నరకం'!

## రోడ్డుపైకి బాత్రూం మురికి నీరు..
## ప్రమాదకరంగా ట్రాఫిక్!
### దుర్వాసనతో అల్లాడుతున్న విద్యార్థులు, బాటసారులు
### అతివేగంగా దూసుకెళ్తున్న వాహనాలు.. భయాందోళనలో తల్లిదండ్రులు
### తక్షణమే బారికేడ్లు ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్



**ఉద్యమ కెరటం, కెరమెరి :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట విద్యార్థులు, బాటసారులు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కనీస పర్యవేక్షణ లోపించడంతో పాఠశాల ప్రధాన ప్రవేశ ద్వారం వద్దే తీవ్రమైన సమస్యలు నెలకొన్నాయి.

### మురికికూపంగా మారిన స్కూల్ గేటు!

పాఠశాల ప్రధాన గేటుకు సమీపంలోనే ఉన్న బాత్రూంలకు సంబంధించిన మురికి నీరు నేరుగా ప్రధాన రహదారిపైకి ప్రవహిస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్ర దుర్వాసనతో కుళ్లినట్లు తయారైంది. స్కూల్‌కు వచ్చే వందలాది మంది విద్యార్థులు, చిన్న పిల్లలు ప్రతి రోజూ ఈ మురికి నీటిలోనే నడుస్తూ వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ అపరిశుభ్ర వాతావరణం వల్ల విద్యార్థులు అంటువ్యాధులు, తీవ్ర రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నిత్యం వాహనాల వేగం.. ప్రాణ సంకటంగా రోడ్డు దాటడం!

మరోవైపు, ఇది మండల కేంద్రం మెయిన్ రోడ్డు కావడంతో నిరంతరం భారీ వాహనాలు, ఆటోలు, బైకులు అతివేగంగా దూసుకెళ్తున్నాయి. ఉదయం పాఠశాల సమయాల్లో, సాయంత్రం స్కూల్ వదిలేటప్పుడు విద్యార్థులు రోడ్డు దాటడానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్కూల్ ముంగట ఎలాంటి ట్రాఫిక్ బారికేడ్లు లేదా స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతుందేమోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనలకు గురవుతున్నారు.

### అధికారులు తక్షణమే స్పందించాలి

పాఠశాల గేటు ముందే ప్రధాన రహదారి ఉండటం వల్ల విద్యార్థుల భద్రత ఇక్కడ పూర్తిగా ప్రశ్నార్థకంగా మారింది. కాబట్టి, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపైకి వస్తున్న బాత్రూం మురికి నీటి సమస్యను తక్షణమే నిలిపివేసి, డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించి, విద్యార్థుల రక్షణ కోసం పాఠశాల ముందు రోడ్డుపై వెంటనే ట్రాఫిక్ బారికేడ్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





# స్వదేశంలో ఐదో కప్‌పై ఇంగ్లండ్ గురి



**లండన్, జులై 3 :**
మహిళల ట్వంటీ-20 ప్రపంచకప్ తుది పోరుకు మరో రెండు రోజులే మిగిలి ఉండటంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. లీగ్ దశలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అద్భుత ప్రదర్శన చేసిన ఇంగ్లండ్, సెమీఫైనల్లోనూ అదే జోరు కొనసాగించి ఫైనల్‌కు చేరుకుంది. మరోవైపు ఆరుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఆస్ట్రేలియా కూడా మరోసారి టైటిల్ కోసం బరిలోకి దిగుతోంది. ఆదివారం లార్డ్స్ మైదానంలో జరగనున్న ఈ తుది సమరంలో ఎవరు విజేతగా నిలుస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది. స్వదేశంలో జరిగే అంతర్జాతీయ టోర్నీల్లో ఇంగ్లండ్‌కు అత్యుత్తమ రికార్డు ఉంది. ఇప్పటివరకు తమ గడ్డపై నిర్వహించిన నాలుగు అంతర్జాతీయ ప్రపంచకప్ టోర్నీల్లో ఒక్కసారి కూడా టైటిల్‌ను చేజార్చుకోలేదు. ఈసారి కూడా అదే విజయ పరంపరను కొనసాగించి ఐదోసారి స్వదేశంలో ప్రపంచకప్‌ను సొంతం చేసుకోవాలని ఇంగ్లండ్ జట్టు పట్టుదలతో ఉంది. నాట్ సీవర్ బ్రంట్ నాయకత్వంలోని జట్టు అన్ని విభాగాల్లో సమతూకంగా కనిపిస్తోంది. ఇది మహిళల ట్వంటీ-20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌కు ఐదో ఫైనల్. గతంలో 2009, 2012, 2014, 2018 సంవత్సరాల్లో ఫైనల్‌కు చేరిన ఈ జట్టు, 2009లో తొలి ట్వంటీ-20 ప్రపంచకప్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా మహిళల వన్డే ప్రపంచకప్‌లలో కూడా 1973, 1993, 2017 సంవత్సరాల్లో విజేతగా నిలిచి ప్రపంచ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 2009లో జరిగిన తొలి మహిళల ట్వంటీ-20 ప్రపంచకప్ ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఓడించి ఇంగ్లండ్ తొలి ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే స్వదేశంలో నిర్వహించిన మహిళల వన్డే ప్రపంచకప్‌లలోనూ వరుస విజయాలు నమోదు చేసింది. ఈ చరిత్ర ఇప్పుడు ఇంగ్లండ్‌కు అదనపు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోంది. అయితే ప్రత్యర్థి ఆస్ట్రేలియాను తక్కువ అంచనా వేయలేమని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఆరుసార్లు ట్వంటీ-20 ప్రపంచకప్‌ను గెలిచిన ఆస్ట్రేలియా పెద్ద మ్యాచ్‌లలో ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించడంలో ఎంతో అనుభవం కలిగిన జట్టు. అందువల్ల ఫైనల్లో అనుభవం, ఆత్మవిశ్వాసం, సమిష్టి ప్రదర్శన కీలకంగా మారనున్నాయి. రెండు జట్లూ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో సమాన బలంతో కనిపిస్తుండటంతో తుది పోరు హోరాహోరీగా సాగుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో జరిగే ఈ మ్యాచ్‌లో ఎవరు ప్రపంచ విజేతగా నిలుస్తారో తెలుసుకోవాలంటే ఆదివారం వరకు వేచి చూడాల్సిందే.

# సుదర్శన్, పడిక్కల్ జోరు..

## భారత్-ఏ భారీ స్కోరు దిశగా



**గాలే, జులై 3 :**
శ్రీలంక-ఏతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత్-ఏ బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. ఓపెనర్లు సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్ అజేయ అర్ధశతకాలతో జట్టును పటిష్ట స్థితిలో నిలిపారు. గాలే వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఇద్దరూ శతక భాగస్వామ్యాన్ని నెలకొల్పి శ్రీలంక-ఏ బౌలర్లను పూర్తిగా ఒత్తిడిలోకి నెట్టారు. చేతిలో ఇంకా తొమ్మిది వికెట్లు ఉండటంతో భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించే దిశగా దూసుకెళ్తోంది. శ్రీలంక పర్యటనలో తొలి అనధికారిక టెస్టు డ్రాగా ముగియడంతో రెండో మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా భారత్-ఏ బరిలోకి దిగింది. ఆ లక్ష్యానికి తగ్గట్టుగానే బ్యాటర్లు ధాటిగా ఆడుతున్నారు. ఓపెనర్ అమన్ మొఖాడే 38 పరుగులు చేసి అవుటైనా, ఆ తర్వాత సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కగా ముందుకు నడిపించారు. సాయి సుదర్శన్ 87 పరుగులతో, దేవ్‌దత్ పడిక్కల్ 74 పరుగులతో అజేయంగా క్రీజులో నిలిచి శతకం దిశగా సాగుతున్నారు. వీరిద్దరి అద్భుత భాగస్వామ్యంతో 50 ఓవర్లు ముగిసే సమయానికి భారత్-ఏ ఒక వికెట్ నష్టానికి 194 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు టాస్ గెలిచిన భారత్-ఏ బౌలింగ్ ఎంచుకుంది. శ్రీలంక-ఏ తొలి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ సహన్ అరాచ్చిగా 127 పరుగులతో శతకం సాధించినా, మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. భారత బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో శ్రీలంక-ఏ 366 పరుగులకు ఆలౌటైంది. భారత్-ఏ బౌలర్లలో గుర్నూర్ బ్రార్, సరాన్ష్ జైన్ చెరో నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటింగ్‌ను కుదేలు చేశారు. యశ్ ఠాకూర్ రెండు వికెట్లు పడగొట్టి సహకారం అందించాడు. ప్రస్తుతం బ్యాటర్లు అదే జోరు కొనసాగిస్తుండటంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించే అవకాశాలు భారత్-ఏకు బలంగా కనిపిస్తున్నాయి.

# రెండో టీ20కు సర్వం సిద్ధం..

## భారత్‌కు శుభవార్తలతో పాటు హెచ్చరిక



మాంచెస్టర్, జులై 3 :
భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల ట్వంటీ-20 సిరీస్‌లో రెండో మ్యాచ్ శనివారం మాంచెస్టర్‌లో జరగనుంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో అభిమానులు నిరాశ చెందగా, రెండో మ్యాచ్‌కు ముందు రెండు శుభవార్తలు, ఒక ఆందోళన కలిగించే అంశం భారత జట్టుకు ఎదురైంది. ఇరు జట్లూ పూర్తి స్థాయిలో బరిలోకి దిగనున్న నేపథ్యంలో ఆసక్తికర పోరు జరగనుంది. భారత అభిమానులకు ప్రధాన ఊరట ఏమిటంటే ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. సాధారణంగా ఇంగ్లండ్‌లో జరిగే మ్యాచ్‌ల కోసం అర్ధరాత్రి వరకు మేల్కొని ఉండాల్సి వస్తుంది. అయితే ఈసారి సాయంత్రం నుంచే మ్యాచ్ ప్రారంభం కానుండటంతో కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా మ్యాచ్‌ను వీక్షించే అవకాశం అభిమానులకు లభించింది. మరోవైపు యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం దక్కే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. పర్యటనలో ఇప్పటివరకు అతడికి అవకాశం రాకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో బ్యాటింగ్ క్రమంలో మార్పులు చేసి వైభవ్‌ను జట్టులోకి తీసుకురావాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. అతడు జట్టులోకి వస్తే భారత బ్యాటింగ్‌కు మరింత బలం చేకూరుతుందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. అయితే భారత జట్టును కలవరపెడుతున్న అంశం ఇంగ్లండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ పునరాగమనం. తొలి మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకున్న ఆర్చర్ ఇప్పుడు రెండో మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉంది. తొలి మ్యాచ్‌లో భారత్ 189 పరుగుల భారీ స్కోరు నమోదు చేయడంతో ఇంగ్లండ్ బౌలింగ్ వైఫల్యంపై విమర్శలు వచ్చాయి. దీంతో బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ఆర్చర్‌ను బరిలోకి దించాలని ఇంగ్లండ్ జట్టు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇటీవల ఐపీఎల్‌తో పాటు న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన ఆర్చర్ ప్రస్తుతం మంచి లయలో ఉన్నాడు. అతని వేగవంతమైన బంతులను ఎదుర్కోవడం భారత టాప్ ఆర్డర్‌కు కఠిన సవాలుగా మారే అవకాశం ఉంది. అందువల్ల రెండో ట్వంటీ-20లో బ్యాటింగ్, బౌలింగ్ పరంగా ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ధోనీ, జొకోవిచ్ ఇద్దరిలోనూ అదే ప్రత్యేకత



**లండన్ :** టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌లపై భారత మహిళల క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. అత్యంత ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లోనూ వారిద్దరూ ప్రదర్శించే ప్రశాంతత, మానసిక దృఢత్వం ఒక్కటేనని కొనియాడింది. ప్రస్తుతం లండన్‌లో జరుగుతున్న వింబుల్డన్ టోర్నమెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షిస్తున్న దీప్తి, జొకోవిచ్ ఆటతీరును ప్రశంసించింది. జియో హాట్‌స్టార్ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. క్లిష్ట సమయాల్లో జొకోవిచ్ వెనుకడుగు వేయడని, ధోనీ కూడా మైదానంలో అంతే ప్రశాంతంగా ఉంటూ ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటాడని చెప్పింది. ఈ ఇద్దరి దిగ్గజాల నుండి క్లిష్ట పరిస్థితులను ఎలా అధిగమించాలో నేర్చుకోవచ్చని తెలిపింది. వింబుల్డన్‌లో మ్యాచ్ చూడటం తన చిరకాల కల అని, తనకు అత్యంత ఇష్టమైన టెన్నిస్ స్టార్ జొకోవిచ్ అని వెల్లడించింది. సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి వంటి దిగ్గజాలతో కలిసి వింబుల్డన్ చూడటం తనకిష్టమని దీప్తి పేర్కొంది. ఇటీవల మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ కూడా వింబుల్డన్ మ్యాచ్‌లను వీక్షించిన సంగతి తెలిసిందే.



# రిటైర్మెంట్‌పై రొనాల్డో స్పష్టత

**న్యూయార్క్, జులై 3 :** ప్రపంచకప్ మధ్యలో తన రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలకు పోర్చుగల్ స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో పూర్తి స్పష్టత ఇచ్చాడు. ప్రస్తుతం తన దృష్టి మొత్తం ప్రపంచకప్‌పైనే ఉందని, కెరీర్‌కు సంబంధించిన నిర్ణయం టోర్నమెంట్ ముగిసిన తర్వాతే తీసుకుంటానని వెల్లడించాడు. క్రొయేషియాతో జరిగిన ప్రపంచకప్ 32వ రౌండ్ మ్యాచ్‌లో అద్భుత గోల్ చేసి పోర్చుగల్ విజయానికి కీలక పాత్ర పోషించిన రొనాల్డో, మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడాడు. తన సోదరి కతియా అవీరో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తాను ఇప్పుడే ఫుట్‌బాల్‌కు వీడ్కోలు చెప్పబోవడం లేదని స్పష్టం చేశాడు. రిటైర్మెంట్ గురించి ఇప్పుడు మాట్లాడాల్సిన అవసరం లేదని రొనాల్డో పేర్కొన్నాడు. ప్రపంచకప్‌లో విజయం సాధించినా, ఓటమి ఎదురైనా టోర్నమెంట్ పూర్తయ్యాక కుటుంబ సభ్యులతో చర్చించి తుది నిర్ణయం వెల్లడిస్తానని తెలిపాడు. ప్రస్తుతం జరుగుతున్న పోటీలపై పూర్తిగా దృష్టి సారించినందున భవిష్యత్ నిర్ణయాల గురించి ఆలోచించడం లేదని చెప్పాడు. ప్రస్తుత క్షణాలను ఆస్వాదిస్తూ పోర్చుగల్ విజయాల్లో తన వంతు పాత్ర పోషించడమే తన లక్ష్యమని రొనాల్డో పేర్కొన్నాడు. ప్రపంచకప్ ముగిసిన తర్వాతే తన భవిష్యత్ ప్రణాళికలపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యలతో స్పష్టమైంది.

# భారత్‌తో వన్డే సిరీస్‌కు ఆర్చర్ పునరాగమనం

**లండన్, జులై 3 :**
భారత్‌తో స్వదేశంలో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు 16 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. దాదాపు ఏడాది తర్వాత స్టార్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ వన్డే జట్టులోకి తిరిగి రావడం విశేషం. అలాగే సస్సెక్స్ ఆల్‌రౌండర్ జేమ్స్ కొల్స్‌కు తొలిసారి వన్డే జట్టులో చోటు లభించింది. వచ్చే వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టును మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఇంగ్లండ్ సెలెక్టర్లు ఈ జట్టును ఎంపిక చేశారు. పూర్తి స్థాయి వన్డే కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్‌కు బాధ్యతలు అప్పగిస్తూ జట్టును ప్రకటించారు. ఇటీవల ఐపీఎల్‌తో పాటు న్యూజిలాండ్‌పై స్వదేశంలో జరిగిన మ్యాచ్‌ల్లో జోఫ్రా ఆర్చర్ ఆకట్టుకునే ప్రదర్శన చేయడంతో అతడికి మళ్లీ జాతీయ జట్టులో అవకాశం లభించింది. గాయాల కారణంగా చాలా కాలంగా జట్టుకు దూరంగా ఉన్న ఆర్చర్ పునరాగమనం ఇంగ్లండ్ బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూర్చనుంది. ఈ ఏడాది శ్రీలంక పర్యటనకు దూరమైన గస్ అట్కిన్సన్, సకీబ్ మహమూద్‌లను కూడా సెలెక్టర్లు తిరిగి జట్టులోకి తీసుకున్నారు. మరోవైపు శ్రీలంక సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించని ఓపెనర్ జాక్ క్రాలే, పేసర్లు జేమీ ఓవర్టన్, బ్రైడన్ కార్సే, ల్యూక్ వుడ్‌లను జట్టు నుంచి తప్పించారు. భారత్, ఇంగ్లండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ జులై 14 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ ఎడ్జ్‌బాస్టన్‌లో, రెండో వన్డే జులై 16న కార్డిఫ్‌లో, మూడో మరియు చివరి వన్డే జులై 19న లార్డ్స్ మైదానంలో జరగనుంది. ఇంగ్లండ్ వన్డే జట్టులో బెన్ డకెట్, జోస్ బట్లర్, జాకబ్ బెథెల్, జో రూట్, టామ్ బ్యాంటన్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), విల్ జాక్స్, జేమ్స్ కొల్స్, సామ్ కరన్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్, సకీబ్ మహమూద్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్ చోటు దక్కించుకున్నారు.

# మెక్సికో అభిమానుల హడావిడిపై ఇంగ్లండ్ ఆందోళన



**మెక్సికో సిటీ :** ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో నాకౌట్ దశకు చేరుకున్న నేపథ్యంలో మెక్సికో అభిమానుల ప్రవర్తనపై ఇంగ్లండ్ జట్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రత్యర్థి జట్ల ఆటగాళ్లకు రాత్రిపూట నిద్ర లేకుండా చేయాలనే ఉద్దేశంతో మెక్సికో అభిమానులు చేస్తున్న హడావిడిని దృష్టిలో ఉంచుకుని తమ జట్టు బస చేసే హోటల్ వద్ద ప్రత్యేక భద్రత కల్పించాలని ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్యను ఇంగ్లండ్ యాజమాన్యం కోరింది. ఇటీవల ఈక్వెడార్ జట్టు బస చేసిన హోటల్ సమీపంలో మెక్సికో అభిమానులు రాత్రంతా టపాసులు కాలుస్తూ, వాహనాల హారన్‌లు మోగిస్తూ తీవ్ర శబ్ద కాలుష్యం సృష్టించారు. దీంతో ప్రత్యర్థి ఆటగాళ్లు విశ్రాంతి తీసుకోలేకపోయినట్లు సమాచారం. ఇదే పరిస్థితి తమకు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంగ్లండ్ జట్టు నిర్ణయించింది. జులై 5న జరిగే పదహారో రౌండ్ మ్యాచ్‌లో మెక్సికోతో ఇంగ్లండ్ తలపడనుంది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ ప్రధాన శిక్షకుడు థామస్ తుచెల్, జట్టు కెప్టెన్ హ్యారీ కేన్ ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య అధికారులను కలిసి తమ జట్టు బస చేసే హోటల్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మ్యాచ్‌కు ముందు రాత్రి ఆటగాళ్లు ప్రశాంతంగా నిద్రపోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన నిర్వాహకులు ఇంగ్లండ్ జట్టు బస చేసే హోటల్ పరిసరాల్లో భద్రతను మరింత పెంచడంతో పాటు అవసరమైతే సమీప రహదారులను తాత్కాలికంగా మూసివేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మెక్సికో అభిమానులు హోటల్ సమీపానికి చేరకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు సమాచారం. ఇంగ్లండ్, మెక్సికో మధ్య జరిగే ఈ కీలక పోరు సముద్ర మట్టానికి సుమారు 2,240 మీటర్ల ఎత్తులో ఉన్న ఎస్తాడియో అజ్టెకా మైదానంలో జరగనుంది. ఈ ఎత్తులో గాలి సాంద్రత తక్కువగా ఉండటంతో బంతి వేగం, దిశలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే మ్యాచ్‌కు రెండు రోజుల ముందుగానే ఇంగ్లండ్ జట్టు మెక్సికో చేరుకుని సాధన ప్రారంభించింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించనుంది. దీంతో మైదానంలోని ఆటతో పాటు మైదానం వెలుపల కూడా ఆటగాళ్లకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ఇంగ్లండ్ జట్టు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది.

# ఏఐ సాయంతో డీప్‌ఫేక్ చిత్రాలు

## బాంబే హైకోర్టును ఆశ్రయించిన ప్రీతిజింతా



బాలీవుడ్ ప్రముఖ నటి ప్రీతీ జింతా తన అనుమతి లేకుండా కృత్రిమ మేధస్సు అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను ఉపయోగించి సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రాలు, మార్ఫింగ్ చేసిన అభ్యంతరకరమైన కంటెంట్‌కు వ్యతిరేకంగా బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఇంటర్నెట్ లోని వివిధ వెబ్‌సైట్ల నుండి ఈ అసభ్యకరమైన కంటెంట్‌ను పూర్తిగా మరియు శాశ్వతంగా తొలగించేలా తక్షణమే అత్యవసర ఉత్తర్వులు జారీ చేయాలని ఆమె న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ మాధవ్ జామదార్ ధర్మాసనం, అంతర్జాలం నుండి ఇలాంటి అభ్యంతరకర కంటెంట్‌ను వేగంగా తొలగించడానికి ఒక సులువైన మరియు ఆచరణాత్మకమైన విధానాన్ని రూపొందించాలని ఇరు పక్షాలకూ సూచించింది. కాగా, ఈ వివాదాస్పద అంశంపై తదుపరి విచారణను న్యాయస్థానం జూలై ఆరవ తేదీకి వాయిదా వేసింది. నటి ప్రీతీ జింతా దాఖలు చేసిన ఈ రిట్ వ్యాజ్యంలో ప్రముఖ సామాజిక మాధ్యమ సంస్థలైన గూగుల్, మెటాలతో పాటు పలు డొమైన్ నేమ్ రిజిస్ట్రార్లను ప్రతివాదులుగా చేర్చారు. నటి తరపున సీనియర్ న్యాయవాది వెంకటేష్ ధోండ్ కోర్టులో బలమైన వాదనలు వినిపిస్తూ, రోజురోజుకూ ఈ డీప్‌ఫేక్ సాంకేతికత యొక్క నాణ్యత మరియు స్పష్టత విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల బాధితులకు జరిగే నష్టాన్ని నివారించడానికి సదరు అభ్యంతరకర లింకులను తక్షణమే బ్లాక్ చేసేలా స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మరోవైపు గూగుల్, మెటా సంస్థల తరఫు న్యాయవాదులు న్యాయస్థానం ముందు స్పందిస్తూ, వివాదాస్పదంగా మారిన సదరు లింకులను తమ ప్లాట్‌ఫారమ్‌ల నుండి తొలగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే, ఇంటర్నెట్ లోని సాధారణ మరియు చట్టబద్ధమైన కంటెంట్‌ను ముందుస్తుగానే పర్యవేక్షించి పూర్తిగా బ్లాక్ చేయాలనే కఠినమైన నిబంధనలను మాత్రం తమపై విధించవద్దని వారు న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న గౌరవ న్యాయమూర్తి, అంతర్జాలంలో ఉండే సాధారణ సమాచారానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, కేవలం ఫిర్యాదులో పేర్కొన్న అభ్యంతరకర లింకులను మాత్రమే త్వరితగతిన తొలగించేలా ఒక స్పష్టమైన ప్రాక్టికల్ ప్రోటోకాల్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చట్టపరిధిని దాటకుండా సాంకేతిక పరిజ్ఞాన దుర్వినియోగాన్ని అడ్డుకోవడమే కోర్టు ముఖ్య ఉద్దేశమని ధర్మాసనం స్పష్టం చేసింది.

# హృత్రిక్, సుసానే విడాకులు

## భరణంగా 400 కోట్లు అంటూ వైరల్



హృతిక్ రోషన్, సుసానే ఖాన్ విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే.. విడాకుల తర్వాత సుసానే రూ.400 కోట్ల భరణం డిమాండ్ చేశారనే వార్తలు వైరల్ అయ్యాయి. వాటిపై ఆమె సోదరి ఫరాఖాన్ తాజాగా స్పందించారు. ఈ విడాకులు ఇరువర్గాల అంగీకారంతోనే జరిగాయని.. ఇప్పటికీ రెండు కుటుంబాల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. హృతిక్ సుసానే విడాకులపై సోషల్ మీడియాలో, బయటా పెద్ద రచ్చ జరిగింది. వారి వ్యక్తిగత జీవితంపై చాలా మంది రకరకాల అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కానీ, వారిద్దరూ ఆ క్లిష్ట పరిస్థితిని ఎంతో గౌరవప్రదంగా, హుందాగా ఎదుర్కొన్నారు. ఇక.. సుసానే రూ.400 కోట్ల భరణం తీసుకున్నారన్న వార్తల్లో నిజం లేదు. భరణం తీసుకుని ఆమె మరింత ధనవంతురాలయ్యారని కామెంట్స్ చేస్తున్నారు. అవి చూసి నా మనసు ఎంతో బాధపడుతోంది. ఆ వార్తలు పచ్చి అబద్ధం అని స్పష్టం చేశారు. దీంతో ఈ వార్తలకు బ్రేక్ పడింది. హృతిక్ రోషన్, సుసానే ఖాన్ డిసెంబర్ 2014లో అధికారికంగా విడాకులు తీసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు (రెహాన్, హ్రిదాన్) ఉన్నారు. విడాకులు తీసుకున్నప్పటికీ.. తాము మంచి స్నేహితులుగా ఉంటూ తమ పిల్లల బాధ్యతలను చూసుకుంటున్నట్లు హృతిక్ తెలిపారు.

# 'రావు బహదూర్' మూవీ రివ్యూ

'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వంలో సత్యదేవ్ నటించిన వైవిధ్యమైన సైకలాజికల్ డ్రామా 'రావు బహదూర్'. మహేష్ బాబు సమర్పణలో వచ్చిన ఈ చిత్రం, 1968–1991 కాలంలో సాగే ఒక రాజవంశీకుడి కథ. క్యాన్సర్‌తో బాధపడుతూ, కొన్ని నెలల ఆయుష్షు మాత్రమే ఉన్న రామప్ప (సత్యదేవ్) ఒక తీవ్రమైన మానసిక రుగ్మత, అనుమానంతో చుట్టూ ఉన్నవారిని ఎలా ఆటాడుకున్నాడు? అతని గతం ఏంటి? అనేదే సినిమా కథాంశం. దీని ద్వారా దర్శకుడు సమాజంలోని కుల వివక్ష, వారసత్వ పిచ్చిని బలంగా ప్రశ్నించారు. సినిమా ప్రారంభం ఆసక్తికరంగా ఉన్నప్పటికీ, కథనం చాలా నెమ్మదిగా సాగడం వల్ల అసలు కథ ఏంటో తెలియడానికి ఇంటర్వెల్ వరకు ఆగాల్సి వస్తుంది. అయితే, సెకండాఫ్‌లో హీరో ఫ్లాష్‌బ్యాక్, పోలీస్ క్యారెక్టర్ ఎంట్రీతో సినిమా వేగం పుంజుకుంటుంది. క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. కథనంలో అక్కడక్కడా సాగతీత ఉన్నా, సత్యదేవ్ అద్భుత నటన, విభిన్నమైన పాయింట్ కోసం ఈ సినిమాను ఒకసారి చూడవచ్చు.

# నాగబంధం గ్రాఫిక్స్ హైలెట్

## కథా కథనంలో కనిపించని పట్టు




సినిమా నిర్మాణ దశ నుంచే తెలుగు ఆడియెన్స్‌లో ఎంతో ఆసక్తిని రేకెత్తించిన చిత్రం నాగబంధం. భారీ గ్రాఫిక్ హంగులతో విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. డివైన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటించగా, అభిషేక్ నామా దర్శకత్వం వహించారు. భారీ అంచనాలతో ఈ సినిమా శుక్రవారం విడుదలై ప్రేక్షకులను మెప్పించింది. అనాథ అయిన రుద్ర (విరాట్ కర్ణ)ను పద్మమ్మ (శరణ్య) చేరదీసి సొంత కొడుకులా పెంచుతుంది. తన చెల్లెలి (సోనియా సింగ్) పెళ్లిని రాజు అనే యువకుడితో ఘనంగా చేయాలని రుద్ర అనుకుంటాడు. సరిగ్గా పెళ్లి సమయంలో రంగనాథ స్వామి ఆలయంలోని బ్రహ్మకమలం కోసం రుద్ర కుటుంబంపై జుల్ఫికర్ అలీ (రిషబ్) దాడి చేస్తాడు. ఈ ప్రమాదంలో రుద్ర ఫ్యామిలీలోని అందరూ చనిపోతారు. వేల ఏళ్లుగా రంగనాథ స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న బ్రహ్మకమలంతో రుద్రకు ఉన్న సంబంధం ఏమిటి? ఆ బ్రహ్మకమలాన్ని దొంగతనం చేయాలని ఆర్కియాలజిస్ట్ ప్రభాకర్ (జగపతిబాబు)తో పాటు అతని కూతురు పార్వతి (నభా నటేష్) ఎలాంటి ప్రయత్నాలు చేశారు? ఆలయంలోని బ్రహ్మకమలం, గరుడ మంత్రాలతో పాటు నాగబంధం గ్రంథం సాయంతో అమరత్వం పొందాలని జుల్ఫికర్ అలీ, భైరాగి (గరుడ రామ్) ఎలాంటి మారణహోమానికి పాల్పడ్డారు? కైలాస పర్వతంలోని విరాటస్వామి ఆలయంలోని ఓ గదిలో ఉన్న రహస్యం ఏమిటి? 17వ శతాబ్దంలో హిందూ దేవాలయాలను దోచుకున్న అబ్దాలీని నాగసాధువు ఎలా నిలువరించాడు? అన్నదే నాగబంధం మూవీ కథ. కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయానికి నాగబంధం రక్షణగా ఉందనే కథ ప్రచారంలో ఉంది. ఆ నాగబంధాన్ని విచ్ఛిన్నం చేయాలంటే గరుడ మంత్రాలు తెలిసి ఉండాలని పురాణాల్లో రాసి ఉంది. ఈ పాయింట్ నుంచే దర్శకుడు అభిషేక్ నామా స్ఫూర్తి పొంది నాగబంధం కథను రాసుకున్నారు. ఈ చిన్న పాయింట్‌కు సనాతన ధర్మం, హైందవ సంస్కృతితో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్‌స్టోరీని జోడించి సినిమాను రూపొందించారు. నాగబంధం విముక్తి కోసం ప్రయత్నించే అసాంఘిక శక్తులు, దేవుడి అండతో వారిని ఎదుర్కొనే సామాన్యుడైన హీరో.. ఈ అంశాల చుట్టే నాగబంధం కథ సాగుతుంది. ప్రతి ఫ్రేమ్ కలర్‌ఫుల్‌గా ఉంటుంది. అబ్బురపరిచే సెట్స్, అదిరిపోయే గ్రాఫిక్స్ లార్జర్ దేన్ లైఫ్‌లాంటి అనుభూతిని అందిస్తాయి. యాక్షన్ ఎపిసోడ్స్ బాగున్నాయి. భైరవకోన ఎపిసోడ్, మానసాదేవి టెంపుల్‌లో జరిగే ఫైట్‌తో పాటు అబ్దాలీ మనుషులకు, నాగసాధువులకు మధ్య జరిగే వార్ సీన్లు గూస్‌బంప్స్ కలిగిస్తాయి. అయితే యాక్షన్ సీక్వెన్స్‌లు సుదీర్ఘంగా సాగడం మాత్రం సినిమాకు మైనస్‌గా మారింది. నాగబంధం కథను మొదలుపెట్టిన తీరు బాగుంది. ఫ్యామిలీ సీన్లు కథకు పెద్దగా అతకలేదు. కథ మొత్తం బ్రహ్మకమలం చుట్టే తిరగడంతో సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. రెండు డిఫరెంట్ షేడ్స్‌తో సాగే పాత్రలో హీరోగా విరాట్ కర్ణ మెప్పించాడు. నాగసాధువుగా అతని లుక్ బాగుంది. యాక్షన్ సన్నివేశాల్లో మెప్పించినా, ఎమోషనల్ సీన్ల పరంగా ఇంకా పరిణితి చూపించాల్సి ఉంది. నభా నటేష్‌కు మంచి రోల్ దక్కింది. పాజిటివ్, నెగెటివ్ కోణాల్లో ఆమె పాత్ర సాగుతుంది. కొద్దిసేపు డ్యూయల్ రోల్‌లో కనిపిస్తుంది. విలన్‌గా రిషబ్ డైలాగ్ డెలివరీ, బాడీలాంగ్వేజ్ విభిన్నంగా ఉన్నాయి. మరో హీరోయిన్ ఐశ్వర్య మీనన్‌కు ఒకటి రెండు డైలాగ్స్ తప్ప పెద్దగా ఇంపా÷–టర్గ÷న్స్ లేదు. జగపతిబాబు, మురళీ శర్మ, మహేష్ మంజ్రేకర్, శరణ్య, అనసూయ, సోనియా సింగ్, అంకిత్ కొయ్యతో పాటు సినిమాలో చాలామందే యాక్టర్లు కనిపిస్తారు కానీ, తమ నటనను చాటిచెప్పే అవకాశం ఎవరికీ దక్కలేదు. విజువల్స్, గ్రాఫిక్స్ పై పెట్టిన శ్రద్ధ కథపై కూడా పెట్టి ఉంటే నాగబంధం రిజల్ట్ మరోలా ఉండేది. చిన్న చిన్న లోపాలున్నా నాగబంధం ప్రేక్షకులను కొంతవరకు మెప్పిస్తుంది.

# మా ఇంటి బంగారం ఓ మంచి సినిమా

## సమంతకు కంగ్రాట్స్ చెప్పిన లెనిన్ అఖిల్




అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. ఈ సినిమా జులై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు అఖిల్. ఇక చిత్ర ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ తాజా ఇంటర్వ్యూలో ఆయన టాలీవుడ్ రీసెంట్ ఇండస్ట్రీ హిట్ 'మా ఇంటి బంగారం' సినిమా గురించి అందులో సమంత నటన గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'లెనిన్' ప్రమోషన్స్ బిజీ వల్ల తాను ఇంకా 'మా ఇంటి బంగారం' సినిమా చూడలేదని, కానీ ఆ చిత్ర ట్రైలర్ చూశానని అఖిల్ వెల్లడించారు. ట్రైలర్ వైబ్ అద్భుతంగా ఉందని, చూసినప్పుడే ఇది కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని తనకు అనిపించిందని చెప్పారు. ఒక మంచి ఇంటికి కోడలిగా వెళ్లి, ఆ కుటుంబ సభ్యులందరితో బంగారం అనిపించుకోవాలనే చక్కటి ఫ్యామిలీ ఎలిమెంట్‌కు పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడించి సినిమాను చాలా కొత్త కాన్సెప్ట్‌తో, సహజంగా తెరకెక్కించారని ఆయన ప్రశంసించారు. ముఖ్యంగా ఒక మహిళా ప్రధాన పాత్రతో ఆ స్థాయి యాక్షన్ సీన్స్ చేయించడం నిజంగా అద్భుతమని కొనియాడారు. ఈ చిత్రంలో సమంత పాత్రను అద్భుతంగా పండించిందని మెచ్చుకుంటూ, కంగ్రాట్స్ సామ్ అంటూ సమంతతో పాటు 'మా ఇంటి బంగారం' చిత్రబృందానికి అఖిల్ తన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విడాకుల తర్వాత కూడా అక్కినేని కుటుంబ సభ్యులతో, ముఖ్యంగా అఖిల్‌తో సమంతకు ఉన్న ఈ రిలేషన్ పరస్పర గౌరవం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇకపోతే అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఇప్పటివరకు ఆశించిన స్థాయి విజయం అందుకోలేకపోయినా, కొత్త ఉత్సాహంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం లెనిన్ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అఖిల్ తన కెరీర్, మూడు సంవత్సరాల విరామం, భవిష్యత్ ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మూడు సంవత్సరాలుగా తన నుంచి సినిమా రాకపోవడంతో అభిమానులు నిరాశ చెందారని అఖిల్ అన్నారు. ఇంత పెద్ద గ్యాప్ వచ్చినందుకు ముందుగా అభిమానులందరికీ క్షమాపణలు చెబుతున్నాను. కానీ ఇకపై సినిమాల మధ్య ఇంత విరామం ఉండదన్నాడు. వరుసగా సినిమాలు చేస్తాను. ఒకవేళ మళ్లీ ఇంత సమయం తీసుకుంటే మా ఇంటికొచ్చి నన్ను కొట్టండి. ఆ బాధ్యతను నేనే తీసుకుంటున్నాను అంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. గత కొద్ది రోజులుగా విశ్రాంతి లేకుండా పని చేస్తున్నా, అభిమానుల ప్రేమ, ఉత్సాహం నాకు కొత్త శక్తిని ఇచ్చాయి. ఈసారి నన్ను నమ్మండి అని ఆయన అన్నారు. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న 'లెనిన్'లో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**